

‖ చిరుత సంధ్యావందనం ‖

తిరుమల శిలాతోరణం వద్ద గుట్టమీద గురువారం సాయంత్రం ఓ చిరుతపులి కాసేపు అస్తమిస్తున్న సూర్యుడిని చూస్తూ నింపాదిగా కూర్చుంది. లేచి ఒళ్లు విరుచుకుని కొండ దిగి వెళ్లిపోయింది. ఈ దృశ్యాన్ని యాత్రికులు తమ మొబైల్ కెమెరాల్లో చిత్రించారు.
- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఈ బెంజ్.. ఏ పుష్పోది?

ఇదో బెంజ్ కారు. తిరుపతి కపిలతీర్థం దగ్గరున్న టాస్క్‌ఫోర్స్ కార్యాలయం ప్రాంగణంలో పదేళ్లుగా ఇలా పడివుంది. శేషాచలంను కొల్లగొట్టే ఎర్రదొంగలు స్మగ్లింగ్‌కి వాడిన బెంజ్ ఇది. 2014లో 334 కేజీల బరువు ఉన్న 24 ఎర్రచందనం దుంగలు తరలిస్తుండగా ఇన్నోవా, హోండాలతో పాటూ ఈ బెంజ్ కారును తిరుచానూరు పోలీసులు లక్ష్మీ చెరువు వద్ద పట్టుకున్నారు. అంతే అప్పటి నుంచీ కోట్లు ఖరీదు చేసే ఈ దర్జా బెంజ్ కారు దీనంగా ఇలా పడివుంది. ఇదొక్కటే కాదు ఎర్ర దుంగలతో దొరికిన దాదాపు వెయ్యి కార్లు దశాబ్దాలుగా తుప్పు పట్టిపోయి మన దర్యాప్తు వ్యవస్థ తీరును వెక్కిరిస్తున్నట్టుగా ముళ్ల పొదల్లో పడివున్నాయి.

-8లో





ఆనంద్ శ్రీన్స్-౯	-	కర్నూలు
భారత్	-	కర్నూలు
ఎఆర్ మిని	-	నంద్యాల
రాజశ్రీ	-	ఆదోని
గంగ	-	అనంతపురం
తరంగిణి	-	అనంతపురం
తాహర్	-	కడప
చాంద్	-	ప్రొద్దుటూరు
చాణక్య	-	చిత్తూరు
సాయిచిత్ర	-	మదనపల్లి

CONTACT : 9550740061

వైసీపీకి 'డిప్యూటీ' పోటు

- భూమన ముఖ్య విధేయుడు దూరం
- కార్పొరేటర్లను కాపాడుకోవడానికి తంటాలు
- తమిళనాడు రిసార్ట్స్‌లో వైసీపీ నేతల రెస్ట్

తిరుపతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక స్థానిక వైసీపీకి తలపోటుగా మారింది. ఆ పార్టీ నుంచి 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్‌రెడ్డిని డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ప్రకటించడంతో భూమన విధేయుల్లో అసమ్మతి సెగ రేగింది. సుదీర్ఘకాలం పాటు భూమన కరుణాకర్ రెడ్డి వెంట నడిచిన కార్పొరేటర్ ఎస్కే బాబు తీవ్రమనస్తాపం చెందారు. రెండు రోజుల కిందట భూమన ఇంట్లో జరిగిన కార్పొరేటర్ల సమావేశానికి గైర్హాజరయ్యారు. దీంతో స్థానిక నాయకత్వం ఆయన్ను తీవ్రంగా తూలనాడినట్టుగా తెలుస్తోంది. దీంతో ఆయన కాస్త రాజకీయ వైరాగ్యానికి గురయ్యారు. మనిషి జీవితం పేపరులాంటిదని ఎంత నలిగితే అంత నిలబడుతుందన్న సందేశంతో సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆయన ఎవరిని ఉద్దేశించి అన్నారో, ఎందుకు అనాల్సివచ్చిందో రాజకీయవర్గాలకు తెలిసినప్పటికీ, సాధారణ ప్రజానీకం కూడా చర్చించుకోవడం మొదలుపెట్టారు. గురువారం మరో వీడియో తన సోషల్ మీడియాలో విడుదల చేసి ఇక వైసీపీకి గుడ్‌బై అన్నట్టుగా నర్మగర్భంగా తేల్చేశారు. ఇంతకాలం నమ్మినబంటుగా ఉన్న వ్యక్తి పరిస్థితే ఇలా ఉంటే ఇక మిగతావారి పరిస్థితి ఎలావుంటుందోనన్న ఆందోళనలో కొందరు కార్పొరేటర్లు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో కూటమి పార్టీ నాయకులు ఎస్కే బాబుతో టచ్‌లోకి వెళ్లినట్టు తెలుస్తోంది. డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఎస్కే ఎటు వైపు ఉంటారన్న ప్రచారం జరుగుతోంది.

మహాబలిపురంలో వైసీపీ క్యాంప్

సొంత పార్టీ కార్పొరేటర్లను కాపాడుకునేందుకు వైసీపీ నానా తంటాలు పడుతోంది. స్థానిక నాయకత్వం డిప్యూటీ మేయర్ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. క్యాంపు రాజకీయాల్లో ఆరితేరినవారిని రంగంలోకి దింపింది. గురువారం ఉదయం సుమారు 20 మంది కార్పొరేటర్లు మహాబలిపురం పయనమైనట్టుగా తెలుస్తోంది. తొలుత పాండిచ్చేరి, గోవా, బెంగళూరు.. ఇలా పలు ఊర్లు పేర్లు చెప్పి చివరికి మహాబలిపురం సమీపంలోని ఓ రిసార్ట్స్‌లో దిగినట్టు సమాచారం. క్యాంపు ఖర్చులన్నింటినీ డిప్యూటీ మేయర్ అభ్యర్థి శేఖర్‌రెడ్డి భుజాలపై స్థానిక నాయకత్వం పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే.. అధికార పార్టీని ధిక్కరించి ఏడాది గడువున్న డిప్యూటీ మేయర్ పదవి తనకు అవసరమా? అన్న సందిగ్ధంలో కూడా అభ్యర్థి ఉన్నట్టు సమాచారం. మరోవైపు క్యాంపునకు వెళ్లినవారి కుటుంబ సభ్యులు కొందరు కూటమి నేతలతో టచ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ముందుముందు డిప్యూటీ మేయర్ ఎన్నిక పరిణామాలు ఎలా మారతాయో కానీ ప్రస్తుతానికి వైసీపీ క్యాంపు రాజకీయ వ్యవహారంతో వాతావరణం వేడెక్కింది.

బెదిరిస్తే ఊరుకోం: భూమన

ప్రజాస్వామ్యంగా ఎన్నిక జరగాలని, తమ కార్పొరేటర్లను లొంగదీసుకోవాలని చూస్తే పోరాటాలకు సిద్ధపడతామంటూ భూమన కరుణాకర్‌రెడ్డి గురువారం ఓ సెల్ఫీ వీడియో విడుదలచేశారు. రాష్ట్ర వైసీపీ మొత్తం తిరుపతిలో తిష్ట వేస్తుందన్నారు. కార్పొరేటర్లను బెదిరించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

- అయితే, గత మున్సిపల్ ఎన్నికలు ఎంతటి ప్రజాస్వామ్యయుతంగా జరిగాయో ఇప్పుడూ అంతే పద్ధతిగా ఉంటాయని 'నీవు నేర్పిన విద్యే నీరజాక్ష' అంటూ పలువురు నెటిజన్లు వ్యాఖ్యానాలు చేయడం గమనార్హం.



ఒక ఆలోచన బస్సునే మార్చేసింది!



గ్రామాలకు తిరుగుతూ ప్రయాణీకులకు సేవలందిస్తున్న కన్వర్షన్ పల్లెవెలుగు బస్సు

- స్క్రాప్ నుంచి పల్లె వెలుగుగా..
- తిరుపతిలో ఆర్టీసీ బస్సుల 'బాడీ కన్వర్షన్'

ఒక చిన్న ఆలోచన.. స్క్రాప్‌కు వెళ్లాల్సిన బస్సులను 'పల్లె వెలుగు' సర్వీసులుగా మార్చింది. బస్సుల కొరతను ఎదుర్కొనేందుకు ఉపయోగపడింది. గతేడాది మొదలు పెట్టిన ఆర్టీసీ బస్సుల 'బాడీ కన్వర్షన్' ప్రక్రియ.. తిరుపతి డిపోలోని ఎనిమిది బస్సుల రూపాలను పూర్తిగా మార్చేసింది. - తిరుపతి(ఆర్టీసీ), ఆంధ్రజ్యోతి



స్క్రాప్ నుంచి పల్లెవెలుగుగా మారుతున్న బస్సు

గతేడాది జనవరిలో 15 ఏళ్లు దాటిన కొన్ని సూపర్ లగ్జరీ బస్సులను స్క్రాప్‌కు పంపేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో కొన్ని గ్రామాలకు నడిపేందుకు పల్లెవెలుగు బస్సుల కొరత ఏర్పడింది. కొత్త బస్సులు వచ్చే అవకాశాలు కనబడలేదు. పైగా స్క్రాబ్‌కు పంపాలని పక్కన పెట్టిన బస్సులలో కొన్ని విడిభాగాలు బాగున్నాయి. దీంతో అప్పటి డీపీటీవోగా ఉన్న చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈగా ఉన్న జి.నరసింహులు సమాలోచనలు జరిపి.. తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ, గ్యారేజీ సిబ్బందితో చర్చించారు. దాని ఫలితమే 'బస్సు బాడీ కన్వర్షన్'. వీరు విజయవాడ ప్రధాన కార్యాలయానికి పంపిన ప్రతిపాదనలకు అక్కడి అధికారులు అంగీకరించి తిరుపతితో పాటు ఇతర జిల్లాలకూ అనుమతులిచ్చారు. బస్సు బాడీ కన్వర్షన్ ప్రక్రియను అనుసరించాలని ఆదేశించారు. తిరుపతిలో తొలుతగా ఓ సూపర్ లగ్జరీ బస్సుపై ప్రయోగాత్మకంగా పనులు మొదలుపెట్టారు. ఉపయోగ పరికరాలు మినహా పాడైనవాటిని తొలగించి స్క్రాప్‌కు వేశారు. రేకులు, సీట్లు, పిల్లర్స్, రంగులు, టైర్లు, లైటింగ్, బ్రేకులు, గేర్‌బాక్సు, ఎయిర్‌ఫిల్టర్, ఇతర సాంకేతిక పరమైన వాటిని కొత్తగా అమర్చారు. వీటికి సుమారు రూ.1.5 లక్షలు ఖర్చు పెట్టి.. 52 సీట్ల సామర్థ్యంతో పల్లె వెలుగు బస్సుగా మార్చారు. కొన్ని రోజుల పాటు డిపోలోనే నడిపి పరిశీలించారు. తర్వాత సిబ్బందిని ఎక్కించుకొని తిప్పారు. ఎలాంటి సమస్య ఎదురు కాకపోవడంతో అనుభవమున్న డ్రైవర్ ధనాంజనేయులను ఎంపికచేసి తిరుపతి నుంచి పళ్లిపట్టుకు నడిపారు. ఈ ప్రయోగం విజయవంతమైంది. దాంతో కాలం చెల్లిన బస్సులను అవసరమైన సంఖ్యలో పల్లె వెలుగు బస్సులుగా మార్చుకోవాలని పూర్తిస్థాయి అనుమతులు వచ్చాయి.

గత ఏడాది 8 బస్సుల బాడీ కన్వర్షన్

2024 జనవరిలో ప్రారంభమైన ఈ ప్రక్రియలో మొత్తం 8 బస్సులను పల్లెవెలుగు బస్సులుగా మార్చారు. రాష్ట్రంలోని 128 డిపోలలో అత్యధిక సంఖ్యలో బస్సు బాడీ కన్వర్షన్ జరిగింది క్క తిరుపతి డిపోలోనే. ఈ ప్రక్రియలో ప్రధాన పాత్ర పోషించిన కోచ్‌బిల్డర్స్ అండ్ వెల్డర్స్ రాజ్‌గోపాల్, సుబ్బరాజు, అంకయ్య, గురవయ్య, గోపికి ప్రశంసా పత్రాలు అందించారు. కొత్తగా నాలుగు అల్ట్రాడీలెక్స్ బస్సులు రాగానే.. పాతవాటిని ఇదే తరహాలో కన్వర్షన్ చేయనున్నారు.



పల్లెవెలుగు బస్సులుగా మార్చేందుకు రెడిగా ఉన్న స్క్రాప్ బస్సులు

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

- రథసప్తమి ఏర్పాట్లే ప్రధాన అజెండా

తిరుమల, జనవరి30(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి శుక్రవారం సమావేశం కానుంది. అన్నమయ్య భవనంలో టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో ఉదయం 10గంటలకు జరిగే సమావేశంలో ప్రధానంగా రథసప్తమి ఏర్పాట్లపైనే చర్చించనున్నారు. తిరుపతి తొక్కిసలాట ఘటన నేపథ్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా తీసుకోవల్సిన జాగ్రత్తలు, దర్శన విధానాలు, మాడవీధుల గ్యాలరీల్లోకి భక్తుల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, ప్రధాన సౌకర్యాలపై చర్చించనున్నారు. ఫిబ్రవరి 4న జరిగే రథసప్తమికి దాదాపు 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా.

దైవారాధన ద్వారా మోక్షం

ఆనందతీర్థాచార్యులు

తిరుమల, జనవరి30(ఆంధ్రజ్యోతి): టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో తిరుమలలో మూడురోజులుగా నిర్వహిస్తున్న పురందరదాసు ఆరాధన మహోత్సవాలు గురువారం ముగిశాయి. ఈసందర్భంగా దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు మాట్లాడుతూ.. మానవ జీవన విధానంలో ఎదురయ్యే సమస్యలకు పూర్వజన్మ కర్మ ఫలమే కారణమన్నారు. దీని నుంచి బయటపడటానికి మహాత్ములను సందర్శించి వారి మార్గదర్శకంలో భగవంతుడిని సేవించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.


భక్తులకు అభిభాషణ చేస్తున్న ఆనందతీర్థాచార్యులు



రాజశ్యామలాదేవికి వైభవంగా తిరుమంజనం

రామచంద్రాపురరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు కట్ట శక్తిపీఠంలో రాజశ్యామలాదేవికి గురువారం వివిధ సుగంధ పరిమళ ద్రవ్యాలతో తిరుమంజనం నిర్వహించారు. దీంతో అమ్మవారి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా పీఠంలో వాస్తు, మృత్యుంజయ హోమం నిర్వహించారు. అమ్మవారిని తమలపాకులతో అలంకరించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, పీఠాధిశ్వరి రమ్యానంద భారతిస్వామి పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.


తమలపాకుల అలంకారంలో అమ్మవారు

నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం: నాని


సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తొండవాడ సమీపంలో ఎన్టీఆర్‌నగర్‌లో రూ.3.10 కోట్లతో ఏర్పాటు చేసిన 33-11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా తయన మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్‌లో ఇప్పటికే కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల తరువాత అభివృద్ధే నినాదంతో తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నియోజకవర్గంలో మరో ఏడు విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఎస్ఈ సురేంద్రనాయుడు మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు ఉంటే 1912 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన పెంచుకుని సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈఈ వాసురెడ్డి, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో శేఖర్, డీఈఈ శేషారెడ్డి, ఏఈ నాగరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు పాల్గొన్నారు.

రైతు సంఘాల ఏర్పాటుతో ఆర్థికాభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న ధశరథరామిరెడ్డి

చంద్రగిరి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రైతులు సంఘాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా ఉద్యాన అధికారి ధశరథరామిరెడ్డి అన్నారు. గురువారం అనంతగుర్రప్పగారిపల్లె గ్రామాల్లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీకృష్ణ ఉద్యాన ఉత్పత్తిదారుల సహకార రైతు సంఘం కలెక్షన్ సెంటర్‌లో రైతులకు రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంఘాల ద్వారా కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. దీనివల్ల దళారీ వ్యవస్థ లేకుండా పంట ఉత్పత్తులను విక్రయించి లాభపడవచ్చునన్నారు. అందుకే ప్రభుత్వం రైతు సంఘాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త పీఎస్ సుధాకర్ మామిడికి సంబంధించి సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి శైలజ,రైతు సంఘం అధ్యక్షుడు మోహనకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం గురువారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రవణ నక్షత్రం సందర్భంగా సాయంత్రం ఉత్సవర్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. ఈకార్యక్రమాల్లో ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల కొట్టానికి నిప్పు: స్థానికుల చొరవతో పశువులు క్షేమం

చంద్రగిరి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పశువులు, గొర్రెలు, మేకలకు పెను ప్రమాదం తప్పింది. బాధితుడు పుల్లయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివరాలు ఇలా... శానంబట్లలో సచివాలయం వెనుక స్వర్ణముఖినది పోరంబోకు స్థలంలో పుల్లయ్య పశువుల కొట్టం వేసుకుని 20 ఏళ్లుగా ఉంటున్నాడు. ఇటీవల రేణిగుంట మండలం కృష్ణాపురానికి చెందిన సుగాలమ్మ పశువుల కొట్టం స్థలం తనదంటూ ఖాళీ చేయాలని చెప్పింది. రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈక్రమంలో గురువారం కొట్టం సమీపంలోని కంచెకు సుగాలమ్మ నిప్పు పెట్టింది. మంటలు ఎగిసిపడటంతో పశువులు అరిచాయి. చుట్టుపక్కల వారు గమనించి మంటలను అదుపు చేశారు. పశువులను రక్షించారు. పోలీసులు కేసును విచారిస్తున్నారు.

శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్ల ప్రదానం




చంద్రగిరి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని డీఆర్డీపీఏ శోభన్‌బాబు అన్నారు. స్వర్ణ నారావారిపల్లి డెవలప్‌మెంట్ లో భాగంగా నారావారిపల్లి, కందులవారిపల్లి, శేషాపురం, భీమవరం గ్రామాల్లోని స్వయం సహాయక సంఘ మహిళలకు జ్యూట్ బ్యాగ్ తయారీపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన మహిళలకు గురువారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈకార్యక్రమానికి శోభన్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళకు రాబోయే రోజుల్లో బ్యాంకులు, పీఎంజీపీ ద్వారా రుణ సౌకర్యం సమకూర్చుతామన్నారు. సంఘంగా ఏర్పడితే మార్కెటింగ్ చేసుకోవచ్చన్నారు. అనంతరం జిల్లా నైపుణ్య అధికారి లోకనాథం, ఏపీఎం .గంగయ్య, ఆర్‌సెటీ డైరెక్టర్ సురేష్‌బాబు, నారీ ఎన్జీవో సంస్థ ప్రతినిధి రజని, సీసీ, గిరి, అభ్యర్థులు పాల్గొన్నారు.

మల్లంగుంటలో ఆక్రమణల తొలగింపు



తిరుపతిరూరల్, జనవరి30(ఆంధ్రజ్యోతి): మల్లంగుంట పంచాయతీ వినాయకనగర్ దారిలట ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను రెవెన్యూ, పంచాయతీ అధికారులు గురువారం ఎక్స్‌వేటర్ సాయంతో తొలగించారు. పి.మహేష్(అలియాస్ మధు)అనే వ్యక్తి తన ఇంటికి రెండువైపులా రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని గ్రామానికిచెందిన వి.అశోక్ ఈనెల20న కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ రామాంజులనాయక్ ఆదేశాలమేరకు పంచాయతీ కార్యదర్శి బాలసుబ్రమణ్యంరెడ్డితో వీఆర్వో యోగానంద్ కలసి గురువారం ఆక్రమణలను తొలగించారు.


తిరుమలలోని నాదనీరాజనం వేదికపై గురువారం సాయంత్రం నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. బెంగళూరుకు చెందిన అశ్విని బృందం ఈప్రదర్శన ఇచ్చింది. గణేశ స్తుతితో కార్యక్రమాన్ని ప్రారంభించి అన్నమయ్య, త్యాగరాజస్వామి కీర్తనలకు చక్కని నృత్య ప్రదర్శన ఇచ్చారు. **- తిరుమల, ఆంధ్రజ్యోతి**

12న రామకృష్ణతీర్థ ముక్కోటి

తిరుమల, జనవరి30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఫిబ్రవరి 12న రామకృష్ణతీర్థ ముక్కోటి జరుగనుంది. సప్తగిరుల్లోని సప్త తీర్థాల్లో పుష్కరిణి, కుమారధార, తుంబుర, శ్రీరామకృష్ణ, ఆకాశగంగ, పాపవినాన, పాండవతీర్థాలు ప్రసిద్ధమైనవిగా చెబుతారు. రామకృష్ణ తీర్థం తిరుమలకు ఆరు మైళ్ల దూరంలో ఉంది. పుష్యమి నక్షత్రంతో కూడిన పౌర్ణమిరోజున ఈ తీర్థముక్కోటిని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఆ రోజు ఉదయం 7.30 గంటలకు శ్రీవారి ఆలయ అర్చకులు పూలు, పండ్లు, స్వామి ప్రసాదాలు, పూజా సామగ్రిని తీర్థానికి తీసుకెళ్లి. రామచంద్రమూర్తి, కృష్ణుడి విగ్రహాలకు సమర్పిస్తారు.

పరిసరాల శుభ్రతలో మందుబాబులు


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ స్వామి

ఎర్రావారిపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నెరబైలు, ఎర్రావారిపాలెం క్రాస్ ప్రాంతాల్లో ఎస్సై డీవై స్వామి ఆధ్వర్యంలో పోలీసులు వినూత్నంగా పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. మద్యం ప్రియులు బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ పడితే మద్యం తాగి బాటిళ్లు, తినుబండారాల వ్యర్థాలను పడేస్తున్నారు. దీంతో ఎస్ఐ ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ సిబ్బంది, మద్యం ప్రియులతో కలిసి పరిసరాలను శుభ్రపరిచారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత తప్పనిసరి

భాకరాపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల మేరకు సీసీ రోడ్లను నిర్మించాలని ఎంపీడీవో గిడ్డయ్య స్పష్టం చేశారు. బొల్లినేనివారిపల్లె వద్ద రూ.25 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లను గురువారం ఆయన పరిశీలించారు. నిధులు, రోడ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్ఆర్డీ సోమశేఖర రెడ్డి, పీఆర్ ఏఈ సూర్యప్రకాశ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లను ఇలా ఎగరేయాలి

● పోలీసులకు శిక్షణ ప్రారంభం



తిరుపతి(నేరవిభాగం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) జిల్లా పోలీసులకు డ్రోన్ల నిర్వహణపై గురువారం నుంచి పోలీసు రిజర్వు గ్రౌండులో శిక్షణ ప్రారంభమైంది. తిరుపతి, తిరుమల, చంద్రగిరి, రిజర్వు, రేణిగుంట సబ్ డివిజన్ల పరిధిలో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది పాల్గొంటున్నారు. సైబర్ క్రైం సీఐ వినోద్ మాట్లాడుతూ పోలీసింగ్ వ్యవస్థను మరింత పటిష్టపరచడానికి డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వరదలు, భూకంపాలు వంటి విపత్తులు జరిగినప్పుడు ఇవి ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.

మోడల్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు: ఆర్డీవో


మాట్లాడుతున్న ఆర్డీవో రామమోహన్

రామచంద్రాపురరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మోడల్‌స్కూళ్ల ఏర్పాటుకు నివేదికలు సిద్ధం చేయాలని ఆర్డీవో రామ్మోహన్ సూచించారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలను ఏకం చేసి పంచాయతీకి ఒకటి వంతున మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. మోడల్ స్కూళ్లతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటరమణ, ఎంఈవోలు మార్కండేయనాయుడు, జయవేలు, క్లస్టర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. **ఎర్రావారిపాలెం:** కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో ఆర్డీఓ రామ్మోహన్ గురువారం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. సమావేశంలో తహశీల్దార్ పరమేశ్వర స్వామి, ఎమ్మీవోలు 1,2లు బాల సుబ్రమణ్యం, సతీస్ బాబు, ఎంపీడీవో అరుణ పాల్గొన్నారు. **భాకరాపేట:** చిన్నగొట్టిగల్లు తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవో రామ్మోహన్ గురువారం క్లస్టర్ల ఏర్పాటుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెం.117 ప్రకారం క్లస్టర్ విభజన జరగాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు జనార్దన్ రాజు, ఎంఈవోలు సత్యనారాయణ, గోపీనాథ్, హెచ్ఎంలు మృదులా దేవి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడలేదని ప్రమాణం చేస్తారా?

● పెద్దిరెడ్డికి ఎమ్మెల్యేలు నాని, మురళి ప్రశ్న

చిత్తూరు సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాలు, దౌర్జన్యాలు, అన్యాయాలు, అక్రమాలు చేయలేదని కాణిపాక వినాయక స్వామి సన్నిధిలో ప్రమాణం చేయడానికి సిద్ధమా అని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీ మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు సవాల్ విసిరారు. చిత్తూరులో గురువారం వీరు మీడియాతో మాట్లాడుతూ.. పులిచెర్ల మండలం మంగళంపేట రెవెన్యూ పరిధిలోని అటవీ భూములను నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించారని చెప్పారు. పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులపై ఉన్న 75 ఎకరాలకు సంబంధించిన భూముల వివరాలను ప్రజలకు చెప్పి, క్షమాపణ చెప్పాలన్నారు. ఒకవేళ ఆ భూములు మీవే అయితే ఎన్నికల అఫిడవిట్‌లో ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. పెద్దిరెడ్డి తీరు మార్చుకోకుంటే జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ ఏకమై తగిన బుద్ధి చెబుతామన్నారు.

అక్రమ సంపాదనను ఖజానాకు జమ చేయండి: భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి30(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో గుంతల రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతుంటే.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రం ప్రభుత్వ నిధులతో బీటీ రోడ్డు, షెడ్ల నిర్మాణం చేపట్టారంటూ నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆరోపించారు. పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై గురువారం ఆయన వీడియో విడుదల చేశారు. ఆక్రమించిన భూములను, అక్రమ సంపాదనను స్వచ్ఛందంగా ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలన్నారు. జగన్‌కు ఏమాత్రం తీసిపోకుండా పెద్దిరెడ్డి అక్రమ సామ్రాజ్యం విస్తరించారని ఆరోపించారు. వీధిరౌడీని తలపించేలా సీఎం పట్ల మాట్లాడటాన్ని తీవ్ర స్థాయిలో తప్పుబట్టారు. పెద్దిరెడ్డి అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టి శిక్ష పడేలా ప్రభుత్వం చేస్తుందన్నారు.

అడవిని మింగేసిన చరిత్ర పెద్దిరెడ్డిది: టీడీపీ

తిరుపతి(వైద్యం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): అడవిని సైతం మింగేసిన చరిత్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిదని తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. అలాంటి అవినీతి చరిత్ర కలిగిన వ్యక్తికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శించే హక్కు లేదన్నారు. ఈ మేరకు గురువారం ఆయన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. జిల్లాలో సీఎంలుగా పనిచేసిన చంద్రబాబు, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రజల అభిమానాలు తప్ప ఆస్తులు సంపాదించింది లేదన్నారు. కానీ, మంత్రిగా చేసిన పెద్దరెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఐదేళ్లలో రూ.లక్షల కోట్లు సంపాదించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతిగృహాల్లో మరమ్మతులు చేపట్టండి


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని, మరమ్మతులకు సంబంధించి వారంలోపు నివేదికలు పంపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలలకు సంబంధించి ఆయన అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పనకు ఫిబ్రవరి 5వ తేదీ నాటికి ప్రతిపాదనలు పంపాలన్నారు. పనులు నాణ్యంగా లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు చెన్నయ్య, బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, చంద్రశేఖర్, సూర్యనారాయణ, రేష్మ, గీత పాల్గొన్నారు.

పల్లెపండుగ పనులు పూర్తి చేయాలి

పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. లక్ష్యం మేరకు ఇంజనీరింగ్ పనులు, సీసీ రోడ్ల నిర్మాణం, అనిమల్ షెడ్ల పనులను వేగవంతం చేయాలని సూచించారు. డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి రామ్మోహన్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సీమరాజ



తిరుమల, జనవరి30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాజకీయ ప్రసంగాలు, విశ్లేషణతో ఫేమస్ అయిన యూట్యూబర్ సీమరాజ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. కాగా, ఆలయం వెలపలకు వచ్చిన సీమరాజాను ఆసక్తిగా చూడటమే కాకుండా సెల్ఫీలు తీసుకున్నారు.

కాళ్లు చేతులు కట్టేసి చిత్ర హింసలు

● వీడియోలో ఓ యువకుడి ఆవేదన ● నిందితుల కోసం గాలింపు


గాయపడిన విష్ణు

తిరుచానూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పాడిపేట హౌసింగ్ కాలనీలో ఓ యువకుడిని ముగ్గురు వ్యక్తులు కాళ్లు చేతులు కట్టి తీవ్రంగా గాయపరచిన ఘటన సోషల్‌మీడియా ద్వారా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు హౌసింగ్ కాలనీకి చెందిన విష్ణును ఇటీవల అదే కాలనీకి చెందిన ముగ్గురు యువకులు కాళ్లు చేతులు కట్టేసి తీవ్రంగా కొట్టారు. దీనికి సంబంధించిన వీడియో గురువారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. దిలీప్, భాను, యశ్వంత్‌లు దాడి చేసి గాయపరచగా తర్వాత తప్పించుకుని ఇంటికి చేరుకున్నట్లు బాధితుడు ఓ మహిళకు వివరిస్తున్నట్లుగా వీడియోలో ఉంది. ఈ వీడియో గురించి తెలుసుకుని .పోలీసులు బాధితుని ఇంటికి వెళ్లారు. అయితే బాధితుడు విశాఖ పట్నం వెళ్లినట్లు తెలిసింది. ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. వీరు గంజాయి మత్తులోనే దాడి చేసినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

తిరుపతిలో గంజాయి బ్యాచ్ వీరంగం

● రెండు రోజుల్లో మూడు ఘటనలు

● తిరుపతి నగరం అశోక్‌నగర్‌లో బుధవారం సాయంత్రం ఇద్దరు మహిళలు పాల ప్యాకెట్లు తీసుకుని ఇంటికి వెళుతున్నారు. గంజాయి మత్తులో ఉన్న కొందరు వారితో అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో వారు భయపడి నోరుమెదపక వెళ్లిపోయారు.

● రైల్వే కాలనీలో ఓ యువకుడు గంజాయి తీసుకుంటుండగా ప్రశ్నించిన అతడిపై దాడికి ప్రయత్నించాడు.

● ఎస్టీవీనగర్‌లోని ఓ టిఫిన్ సెంటరు నిర్వాహకుడు డిఫిన్ డబ్బులు అడగడంతో గురువారం దౌర్జన్యం చేశారు.

తిరుపతిలో ఎక్కడో ఒక చోట గంజాయి బ్యాచ్ వీరంగం చేస్తూనే ఉంది. ముఖ్యంగా అశోక్‌నగర్, మధురానగర్, ఎస్టీవీ నగర్ తదితర ప్రాంతాల్లో గంజాయి మత్తులో మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. అశోక్‌నగర్ ప్రాంతంలో దాదాపు పది మంది యువకులు పగటిపూట నడిరోడ్డుపైనే గంజాయి ప్యాకెట్లు తెచ్చుకుని పీలుస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా వారం రోజులుగా సాగుతున్నా పోలీసులు పట్టించుకున్న దాఖలాల్లేవని మహిళలు వాపోతున్నారు. తాజాగా రైల్వే కాలనీకి వెళ్లే దారిలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఒక కుటుంబాన్ని గంజాయి మత్తులో ఉన్న కొందరు అడ్డుకుని దౌర్జన్యం చేశారు. ఎస్టీవీ నగర్‌లోనూ మందుబాబులు, గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తున్నాయి. ఎవరైనా నిలదీస్తే దాడి చేస్తుండటంతో భయపడుతున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా ఎస్టీవీనగర్‌లో గంజాయి బ్యాచ్ ఆగడాలు తగ్గలేదని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక, పాడిపేట, దామినేడు, ముళ్ళపూడి, తనపల్లి వంటి ప్రాంతాల్లోనూ సాయంత్రమైతే రోడ్లపైకి వచ్చి వివిధ రకాలుగా గలాటాలు చేస్తున్నారు. ఇలా తిరుపతిలో వీరంగం చేస్తున్న గంజాయి బ్యాచ్‌లను పోలీసు యంత్రాంగం ఉక్కుపాదంతో అణచివేసేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతిరూరల్, జనవరి30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎనిమిది కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేసే స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.రామచంద్ర కోరారు. తన కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. బీసీ, ఈబీసీ, బ్రాహ్మిణ, కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపు(బలిజ, తెలగ, ఒంటరికులాలు) కార్పొరేషన్ల ద్వారా బ్యాంక్ లింకేజ్, సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నారని ఎంపీడీవో చెప్పారు. గ్రామాల్లోని దీనిపై అవగాహన కల్పించాలన్నారు. ఆసక్తిగలవారు నేరుగా సచివాలయాల్లో సంప్రదించి ఫిబ్రవరి7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. **పాకాల:** బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో వి.అరుణ కోరారు. బీసి, ఈబీసీ, బ్రాహ్మణ, కమ్మ, క్షత్రియ రెడ్డి, వైశ్య కాపుకులాలకు చెందినవారు స్వయం ఉపాధి కల్పనకు వ్యవసాయం, పశువుల పెంపకం, రవాణా రంగం, పరిశ్రమలు, సేవలు తదితర రంగాల్లో బ్యాంకు లింకేజితో 51 రాయితీపై యూనిట్లు మంజూరయ్యాయన్నారు.

పింఛన్ల పంపిణీకి ప్రోత్సాహక బహుమతులు

తిరుపతిరూరల్, జనవరి30(ఆంధ్రజ్యోతి): ఒక్క రోజులో వందశాతం ఎన్టీర్ సామాజిక పింఛన్లను పంపిణీ చేసే సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో రామచంద్ర నేతృత్వంలో బహుమతులు ప్రదానం చేస్తున్నారు. గత రెండు నెలల్లో ఇలా పంపిణీ చేసిన పెరుమాళ్లపంచాయతీలోని ఎస్వీనగర్‌కి చెందిన జానకిరామ్(గ్రేడ్-5కార్యదర్శి)టీం, తిరుచానూరు లక్ష్మీనగర్‌కి చెందిన సౌజన్యలకు గురువారం బహుమతులు అందజేశారు.

అవార్డు గ్రహీతలకు టీడీపీ నేతల సన్మానం

భాకరాపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నుంచి ప్రశంసలందుకున్న అధికారులను స్థానిక టీడీపీ నేతలు గురువారం సత్కరించారు. తహసీల్దారు జనార్దన్ రాజు, సీఐ ఇమ్రాన్ బాషాలను శాలువా,పూలమాలలతో సన్మానించి. అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, సర్పంచ్ మనోహర, సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, వెంకటసుబ్బయ్య, చోటా సాహెబ్, బెల్లంకొండ రమణ పాల్గొన్నారు.

భాకరాపేటలో ఇళ్ల స్థలాల పరిశీలన

భాకరాపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): భాకరాపేట రెవెన్యూ గ్రామం సర్వే నెం.329లో పదేళ్ల క్రితం ఇంటి స్థలాలు పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో కొందరు నకిలీ పట్టాలతో ఇళ్ల స్థలాలు తీసుకున్నారని ఎమ్మెల్యే పులివర్తి నానికి స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆ పట్టాలను పరిశీలించి అర్హులో కాదో తేల్చాలని తహసీల్దారును ఆదేశించారు. దీంతో గురువారం వీఆర్వో శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రతి ఇంటి పట్టాను పరిశీలించి వివరాలను సేకరిస్తున్నారు.

రథసప్తమికి ఆర్టీసీ ముందస్తు చర్యలు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 4న రథసప్తమిని పురస్కరించుకుని భక్తుల రద్దీకనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడిపేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. 3, 4, 5తేదీల్లో అదనపు బస్సులను అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. రైల్వేస్టేషన్, విష్ణునివాసం ముందు, సీబీఎస్‌లోని ఏడుకొండలు, అలిపిరిలోని టూరిస్టు బస్టాండు వద్ద నుంచి అదనపు బస్సులు రాకపోకలు సాగిస్తాయి. చెన్నై, వేలూరు, బెంగళూరు, కంచి బస్సులను కూడా ఆ రెండు రోజులు తిరుపతి-తిరుమల మధ్య తిప్పనున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్

తిరుపతి అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని జిల్లా ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ వైద్యులను, సిబ్బందిని హెచ్చరించారు. గురువారం ఆయన మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ఎన్‌సీడీ, స్కూల్‌హెల్త్ స్క్రీనింగ్స్, ఆర్సీహెచ్‌లకు తగు సూచనలిచ్చారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, మంగళం మెడికల్ ఆఫీసర్ డాక్టర్. జయంతి పాల్గొన్నారు.

కర్ణాటక ఏటీఎంకు సన్మానం



ఏటీఎంకు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న మునిరాజా తదితరులు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఆర్టీసీ తిరుపతి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పంచేష్ గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సహోద్యోగులు, మిత్రులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఏపీఎస్, కర్ణాటక, తమిళనాడు ఆర్టీసీ కంట్రోలర్స్ లతారెడ్డి, మల్లమ్మ, రంగయ్య, గోపాల్, మునిస్వామిరెడ్డి, మహేష్, త్రినాథ్, దేవరాజు, సురేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన చికెన్ విక్రయం

● షాప్‌ను సీజ్ చేసిన అధికారులు



చికెన్ దుకాణం వద్ద గుమికూడిన విక్రయదారులు - కుళ్లిపోయిన చికెన్

తిరుపతి (జీవకోన), జనవరి 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని హరిశ్చంద్ర శ్మశానవాటిక సమీపంలో గల ఒక చికెన్ దుకాణంలో కుళ్లిన చికెన్ విక్రయించడంతో అధికారులు సీజ్ చేశారు. నగరంలోని చికెన్ దుకాణాల్లో కేజీ చికెన్ రూ.220 నుంచి రూ.240 వరకు విక్రయిస్తుండగా ఈ దుకాణంలో మాత్రం రూ.150 నుంచి రూ.180కు విక్రయిస్తుండటంతో మార్కెట్‌లోని దుకాణ యజమానులు అనుమానం వచ్చి పరిశీలించారు. పది రోజులకు పైగా డీప్‌ఫ్రిజ్‌లో పెట్టి కుళ్లిన చికెన్‌ను విక్రయిస్తున్న విషయాన్ని గమనించారు. వెంటనే మున్సిపల్ హెల్త్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించి, దుకాణాన్ని సీజ్ చేశారు. ఇలాంటివి పునరావృతమైతే ట్రేడ్ లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.

గోవు లేనిదే మానవ మనుగడ లేదు

తిరుపతి(వైద్యం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): గోవు లేనిదే మానవ మనుగడ ఉండదని గోరక్షణ మహా పాదయాత్ర చేపట్టిన బాలకృష్ణ గురుస్వామి పేర్కొన్నారు. అఖిల భారత గో సేవ ఫౌండేషన్ నేతలతో కలిసి ఆయన గురువారం ప్రెస్‌క్లబ్‌లో గోవు ప్రాముఖ్యత గురించి వివరించారు. గోవులను పరిరక్షించుకునేందుకు గత ఏడాది సెప్టెంబరు 27న కశ్మీర్‌లో చేపట్టిన గోరక్ష మహా పాదయాత్ర తిరుపతికి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. గోవులో ముక్కోటి దేవతలు కొలువై ఉంటారని, అలాంటి వాటిని సంరక్షించుకోవడం మన బాధ్యత అని అన్నారు. గోవులకు జాతీయ ప్రాణిగా గుర్తింపు తీసుకువచ్చేందుకు ఈ పాదయాత్రను చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో చంద్రమౌళి, ఝాన్సీ లక్ష్మీభాయ్, నిరంజన్, గీతాంజలి, ప్రభాకర్ పాల్గొన్నారు.

విలీన పంచాయతీల సమస్యల పరిష్కారానికి

ప్రత్యేక ప్రణాళికలు

తిరుపతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : నగరంలో విలీనమైన పంచాయతీల్లో ఎక్కువ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు చేపట్టిన ప్రణాళికలు పక్కాగా అమలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణపై గురువారం మధ్యాహ్నం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖ అధికారులతో ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మౌర్య మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై ఫిర్యాదులు వస్తున్నాయని, రాకుండా చూసుకోవాలని అన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

కమిషనరు మేడం.. గోవిందనగర్‌కూ రండి

● సమస్యలతో ఇబ్బంది పడుతున్నామంటున్న స్థానికులు





గోవిందనగర్‌లో చర్చి వెనుకవైపు వీధిలో దెబ్బతిన్న రోడ్డు

తిరుపతి (జీవకోన), జనవరి 30(ఆంధ్రజ్యోతి): కమిషనరు మేడం.. మీరు మా గోవిందనగర్‌కూ రండి. సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి అని కోరుతున్నారు స్థానికులు. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' ఏబీఎన్- ఆంధ్రజ్యోతి కార్యక్రమం చేపట్టిన తర్వాత జీవకోనలోని పలు ప్రాంతాల్లోని కమిషనరు మౌర్య పర్యటించారు. సమస్యలను తెలుసుకుని.. కళ్లారా చూసి పరిష్కార చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో జీవకోన ప్రాంతం 47వ డివిజన్ గోవిందనగర్‌లోనూ సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ కొన్ని రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. చర్చి వెనుక వైపు వీధిలో మూడున్నర ఏళ్ల ముందు డ్రైనేజీ లైన్ కోసం పనులు చేపట్టారు. ఆ సమయంలో రోడ్లు పూర్తిగా (21-4-112/ఏ, 21-4-36/ఏ ఇళ్ల వద్ద) దెబ్బతిన్నాయి. పనులు చేపట్టిన చోట మరమ్మతులు చేపట్టలేదు. అప్పట్నుంచి గుంతలమయంగా ఉన్న రోడ్లలో రాకపోకలు సాగిస్తున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్లంతా బురదమయంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన చెందారు.

మా వీధుల్ని పట్టించుకునే వారే లేరు : శ్రీదేవి



మా కాలనీలో కొన్ని వీధులు గుంతలమయంగా మారినా ఎవరూ పట్టించుకోవడం లేదు. డ్రైనేజీ కోసం రోడ్డు తవ్వి వదిలేశారు. వాటికి ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. అధికారులు స్పందించి రోడ్లు వేయాలి.

వర్షమొస్తే బురదమయం: లక్ష్మి



రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో చిన్నపాటి వర్షం వచ్చినా బురదమయంగా మారుతున్నాయి. దీంతో మాకు చాలా ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి మా రోడ్లను బాగు చేయాలి.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి (జీవకోన), జనవరి 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం గోవిందనగర్‌లో మ్యాన్‌హోల్ దెబ్బతింది. దీనిపై 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండగా..' కార్యక్రమంలో భాగంగా ఆంధ్రజ్యోతి దినపత్రికలో సమస్యను ప్రస్తావిస్తూ కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టారు.

హాజరు నమోదు పక్కాగా ఉండాలి

పాఠశాలలను తనిఖీ చేసిన కమిషనర్ మౌర్య



పాఠశాలను తనిఖీ చేస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, జనవరి30(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థుల హాజరు నమోదును కమిషనర్ ఎన్.మౌర్య గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు నమోదు, కల్పిస్తున్న మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థుల హాజరు నమోదు పక్కాగా ఉండాలని, అందరూ బడికి వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. యూనిఫాం, బ్యాగులు, పుస్తకాల పంపిణీ వివరాలను యూడీఐఎస్ఈ యాప్‌లో నమోదు చేయాలన్నారు. విద్యా బోధన విధానాన్ని పరిశీలించి, విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.

బహిరంగ మద్యపానంపై కఠిన చర్యలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 30(ఆంధ్రజ్యోతి) బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ చిన్నగోవిందు హెచ్చరించారు. గురువారం రూరల్ పరిధిలోని చెర్లోపల్లి, జూపార్కు ప్రాంతాల్లో ఆయన తనిఖీలు చేశారు. రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదల మాటున ఆకతాయిలు మద్యం తాగుతున్నారని తెలుసుకుని ఆయా ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బడి సుధాయాదవ్, ఎస్ఐ షేక్ షావలి పాల్గొన్నారు.

టీటీడీలో ఉద్యోగ నియామకాలపై దృష్టి సారించండి

తిరుపతి (జీవకోన), జనవరి 30(ఆంధ్రజ్యోతి): టీటీడీలో ఉద్యోగ నియామకాలపై దృష్టి సారించాలని బీజేపీ నేత న వీన్‌కుమార్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, దానికి తగినట్లు రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య పెంచాల్సిన అవసరముందని తెలిపారు. కొత్త ఉద్యోగాల నియామకం చేపట్టకపోవడంతో ఉన్న వారిపై పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. పాలకమండలి, అధికారులు దీనిపై దృష్టి సారించాలన్నారు.

వీధి దీపాలు వెలిగేలా చూడండి

తిరుపతి (జీవకోన), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం 50వ డివిజన్ పరిధిలోని భూపాల్‌హౌసింగ్ కాలనీ, తిమ్మినాయుడుపాళెం, అరుంధతివాడ, గరుడాద్రినగర్, శ్రీనివాస్‌నగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ అనిల్‌కుమార్, ఇంజనీరింగ్, ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, డీఈ వెంకటప్రసాద్, ఎలక్ట్రికల్ డీఈ శిల్ప పాల్గొన్నారు.

మహాత్ముడికి ఘన నివాళి



గాంధీకి నివాళి అర్పిస్తున్న వీసీ ఉమ, తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో మహాత్మాగాంధీకి ఘన నివాళి అర్పించారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఆ యూనివర్సిటీలోని గాంధీ విగ్రహానికి వీసీ ప్రొఫెసర్ ఉమ పుష్పాంజలి ఘటించారు. వీసీ మాట్లాడుతూ సత్యం, అహింస అనే ఆయుధాలతో స్వాతంత్ర్యాన్ని సాధించిన మహాత్ముడు గాంధీ అని కొనియాడారు. రిజిస్ట్రార్ రజని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీఎంసీ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్‌గా రవిశంకర్

తిరుపతి(వైద్యం), జనవరి 30(ఆంధ్రజ్యోతి), ఎస్వీ వైద్య కళాశాల అనుసంధానమైన రుయాస్పత్రికి ఆర్థోపెడిక్ ప్రొఫెసర్‌గా డాక్టర్ పి.రవిశంకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు జీజీహెచ్‌లో ఆర్థోపెడిక్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రవిశంకర్ ఆరోగ్య సమస్యల రీత్యా అక్కడి నుంచి తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు బదిలీ చేయాలని ప్రభుత్వానికి విన్నవించుకోవడంతో ఆయన్ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కొవిడ్-19 అమరవీరుల త్యాగం వెలకట్టలేనిది



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

తిరుపతి (వైద్యం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని వణికించిన కొవిడ్-19 విపత్కర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను రక్షించే క్రమంలో అశువులు బాసిన వైద్యులు, వైద్య సిబ్బంది త్యాగం వెలకట్టలేనిదని ఈఎస్ఐ ఆస్పత్రి ఎంఎస్ శ్యాంబాబు, ఐఎంఏ తిరుపతి శాఖ అధ్యక్షుడు ఆర్.ఆర్.రెడ్డి అన్నారు. అశువులు బాసిన వారి త్యాగాలను స్మరిస్తూ ఈఎస్ఐ, ఐఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి ఎమ్మార్‌పల్లె పోలీస్ స్టేషన్ సర్కిల్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కొవిడ్ సమయంలో వైద్యులు, వైద్య సిబ్బంది చేసిన సేవలు, త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కొవిడ్ సేవలందిస్తూ మృతిచెందిన డాక్టర్ మనోహర్ జ్ఞాపకార్థం కుమారుడు డాక్టర్ కృష్ణను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఐఎంఏ నేతలు శ్రీహరిరావు, మధుసూదన్, శ్రీకర్, ఈఎస్ఐ ఆస్పత్రి ఆర్ఎంవో ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్లు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన ఫలితాలు రైతులకు చేరాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో చేపట్టిన పరిశోధనా ఫలితాలు, ఆవిష్కరణలు అంతిమంగా రైతుల అభివృద్ధి కోసం దోహదం చేయాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మి ఆకాంక్షించారు. తిరుపతి వ్యవసాయ ప్రాంతీయ పరిశోధనా కేంద్రం (ఆర్ఏఆర్ఎస్)లో స్టార్టప్‌లపై గురువారం రైతులకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుత వ్యవసాయ రంగ, రైతాంగ సమస్యలను వ్యవసాయ శాస్త్రవేత్తలు అంచనా వేయాలన్నారు. తద్వారా పరిష్కారాలు సూచించాలన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఐసీఏఆర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటకుమార్ మాట్లాడుతూ ఇమ్మర్షన్ ప్రోగ్రామ్ దేశంలోనూ, రాష్ట్రంలోనూ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. నాబార్డు అధికారి సునీల్ మాట్లాడుతూ సాంకేతికతను అమలు చేయడంలో వ్యవసాయ రంగం మరింత చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సుమతి, సీఈవో మోహన్, రైతులు పాల్గొన్నారు.

మార్చి 12 నుంచి విరించి-2025

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పద్మావతీ మహిళా యూనివర్సిటీలో మార్చి 12, 13 తేదీల్లో విరించి-2025 కార్యక్రమం నిర్వహించనున్నారు. విద్యార్థులకు ప్రతిభా, కళా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తారు. బ్రోచర్‌ను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ ఆవిష్కరించారు. కార్యక్రమ ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్ఠును ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారించవచ్చు



మాట్లాడుతున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి (వైద్యం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశముందని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. స్విమ్స్‌లో గురువారం ప్రపంచ కుష్ఠువ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కుమార్ మాట్లాడుతూ గురువారం నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు స్పర్శ్ లెప్రసీ నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో డీన్ అల్లాడి మోహన్, శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఉషా కళావత్, వైద్య విభాగాధిపతులు సురేఖ, రవిశంకర్, బీ.వీ.రమణ, వనజాక్షమ్మ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దళితుడిపై దాడి విషయంలో.. ఎస్పీ స్పందన భేష్

తిరుపతి(వైద్యం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల చిరు వ్యాపారి బాబుపై ఈనెల 24న జరిగిన హత్యాయత్నానికి సంబంధించిన కేసులో వెంటనే స్పందించి, విచారణను వేగవంతం చేసిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు దళిత సంఘాల ఐక్యవేదిక తరఫున గౌడపేరు చిట్టిబాబు, కరాటపు సుధాకర్, గోపీలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు మాట్లాడుతూ దాడి విషయమై న్యాయం కోసం ఎస్పీని కలిస్తే తక్షణమే ఆయన స్పందించడమేగాక నిందితులను గుర్తించి, కేసులు నమోదు చేయడం అభినందనీయమన్నారు. అలాగే నిందితులకు అండగా నిలుస్తున్న పలువురు టీడీపీ, జనసేన నేతలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి పుస్తక ప్రదర్శన

తిరుపతి(వైద్యం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1 నుంచి 9వ తేదీ వరకు ఇస్కాన్ రోడ్డులోని టీటీడీ మైదానంలో 17వ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు విద్యాసంస్థల డైరెక్టర్ సత్యనారాయణరాజు తెలిపారు. గురువారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ దాదాపు 70 స్టాల్స్ ద్వారా టీటీడీ, సాహితీ ప్రచురణలు, వైజ్ఞానిక, పౌరాణిక, ఇతిహాస, మనోవిజ్ఞాన, న్యాయచరిత్ర ఇలా అనేక రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రారంభోత్సవానికి సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి బీఎన్ శ్రీకృష్ణ, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, కలెక్టర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

కులమతరహిత సమాజమే గాంధీ లక్ష్యం



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కులమత రహిత సమాజమే మహాత్మాగాంధీ లక్ష్యమని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని అఖిల భారత రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు కోరారు. గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని టీపీ ఏరియాలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మతోన్మాదులే దేశాన్ని పాలిస్తూ ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, గాంధీ ఆశయంతో పార్టీ నాయకులు ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యం, కేఆర్ఎస్ మణ్యం, బుజ్జమ్మ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రైల్వే కల్యాణ మండపానికి నేడు భూమిపూజ

తిరుపతి(సెంట్రల్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే ఉద్యోగుల కోసం నిర్మించనున్న కల్యాణ మండపానికి శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణకుమార్ జైన్ భూమిపూజ చేయనున్నారు. తిరుపతి పర్యటన నిమిత్తం వస్తున్న ఆయన తిరుమల శ్రీవారి దర్శనానంతరం పడమర రైల్వే స్టేషన్ సమీపంలో కల్యాణ మండపానికి భూమిపూజ చేస్తారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

తిరుపతి (కలెక్టరేట్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : చంద్ర గిరి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిం చాలని ఎమ్మెల్యే పులివర్తి నాని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. గురువారం కలెక్టరేట్‌లో కలిసి నియోజకవర్గంలో సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా తయారు కావాలి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. తిరుపతి డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో కెనరా బ్యాంకు సహకారంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ ఇచ్చారు. వ్యాపార మెలకువలు నేర్పించారు. అధికారులు ధనంజయరెడ్డి, ఆదినారాయణ, దుర్వాసులనాయుడు, ప్రొఫెసర్ గురునాథనాయుడు, బిజినెస్ ఎక్స్‌పర్ట్ విజయకుమార్ పాల్గొన్నారు.

'రూ.1.40 లక్షల కోట్ల అప్పు మిగిల్చిన వైసీపీ'

తిరుపతి(వైద్యం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో రూ.1.40 లక్షల కోట్ల అప్పులు మిగిల్చిందని టీడీపీ తిరుపతి పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ విలాసాలకు, జల్సాలకు దాదాపు రూ.1,981 కోట్ల ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారని, ప్రకటనల పేరుతో సాక్షికి రూ.500 కోట్లు దోచిపెట్టారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పులకు కూటమి ప్రభుత్వం ఏడాదికి అసలు, వడ్డీతో కలిసి రూ.71 వేల కోట్లను చెల్లించాల్సి వస్తోందన్నారు. ఇంత కష్టంలోనూ తమ ప్రభుత్వం హామీలను అమలు చేస్తోందని తెలిపారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు 'వంద'నం



రాకెట్ నమూనాలో కొందరు.. 100 అంకె ఆకృతిలో మరికొందరు. ఇలా విద్యార్థులు కూర్చుని ఇస్రో శాస్త్ర వేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. షార్ నుంచి బుధవారం వందో రాకెట్ ప్రయోగం విజయవంత మైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం గూడూరులోని గాయత్రి ఇంగ్లీషుమీడియం పాఠశాలలో విద్యార్థులు రాకెట్ నమూనాలో మానవ హారాన్ని ఏర్పాటు చేసి శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, శ్రీహరి, సోనియా, రఫీ, రాఘవయ్య, సుప్రజ, మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి

ట్రయల్ రన్



రథసప్తమి సందర్భంగా తిరుమలలో ఫిబ్రవరి 4న ఉదయం నుంచి రాత్రి వరకు ఏడు వాహనాలపై మలయప్ప మాడవీధుల్లో ఊరేగనున్నారు. ఈక్రమంలో భారీ పరిమాణంలో కలిగిన సర్వభూపాల, సూర్యప్రభ వాహనాల పటిష్ఠతను పరిశీలించేందుకు టీటీడీ అధికారులు గురువారం ఉదయం ట్రయల్ రన్ నిర్వహించారు. అధిక బరువుండే ఈ వాహనాల ఊరేగింపులో వాహన బేరర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలించారు. వాహన మండపం నుంచి ఆలయం వరకు.. అక్కడ్నుంచి తిరిగి వాహనమండపం వరకు ఈ ట్రయల్ రన్ నిర్వహించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 7 గంటలు

తిరుమలలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.14 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 62,710

తలనీలాలు సమర్పించినవారు : 15,635





వామ్మో... ఇవన్నీ పుష్పా కార్లు

- ఎర్రచందనం స్మగ్లింగ్‌లో పట్టుబడి తుక్కుగా మారుతున్న వాహనాలు
- దర్యాప్తులో జాప్యంతో రూ.కోట్ల నష్టం

తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఈ కార్లు వేలం వేస్తామహో...! అని తిరుపతి డివిజన్ అటవీశాఖ ప్రకటించింది. ఇండియాలో షోరూములున్న అన్ని కార్లూ కపిలతీర్థం దగ్గరున్న టాస్క్‌ఫోర్స్ ఆఫీసు ఆవరణలోని తుప్పల్లో ఇలా ఉన్నాయి. కోరిన మోడల్.. కారు చవగ్గా వేలంలో ఎగరేసుకుపోవచ్చని ఆశ పడితే మాత్రం హుళుక్కే! వీటిలో ఇంజన్లు ఉన్నాయో లేదో తెలీదు. ఉన్నా ఏ పార్టులు మిగిలివున్నాయో చెప్పలేం. విత్తనాలు పడి, మొక్కలు మొలిచి, మానులై పెరిగి, తీగలు అల్లుకుని ఇదిగో ఇలా ఉన్న ఈ కార్లను కొని రోడ్ల మీద తిప్పడం సాధ్యమేనా? తుక్కుకు తప్ప పనికిరాని తుప్పుగా మారిన ఈ కార్లను కొనే సాహసం పాత సామాన్లు కొనేవారు తప్ప ఇంకెవరూ చేయడం లేదు. అందుకే 2024 సెప్టెంబర్‌లో 40 వాహనాలను వేలం వేయగా కేవలం రూ.18.59లక్షలు మాత్రమే వచ్చింది. ఫిబ్రవరి 5న 153 వాహనాలు వేలం వేసేందుకు అటవీ శాఖ సిద్ధపడింది. ఇంకా 800కు పైగా వాహనాలు కనీసం తుక్కుగా కూడా పనికిరాని విధంగా పడివుంటాయన్నమాట.

ఎందుకిలా? దర్యాప్తులో అసాధారణ జాప్యం వల్ల ఎర్రచందనం స్మగ్లింగ్‌లో పట్టుబడ్డ వాహనాలు ఇలా పనికిరానివిగా మిగిలిపోతున్నాయి. పట్టుబడ్డ వాహనాల యజమానులను గుర్తించడమే పెద్ద సమస్య. స్మగ్లింగ్‌కి వాడే వాహనాలకు సాధారణంగా అసలు నెంబర్లు ఉండవు. చాసిస్ నెంబర్లను కూడా మార్చేస్తుంటారు. దీంతో వీటి అసలు యజమానులు ఎవరో తేలలేదు అని నిర్ధారించేసరికే ఏళ్లకు ఏళ్లు పడుతోంది. అప్పటికే ఇవి మట్టిలో కూరుకుపోయి, చెట్ల మధ్య మునిగిపోయి ఇలా మారుతున్నాయి. ఆ తర్వాత వీటి వేలాని అనుమతి పొంది, విలువ కట్టాల్సిందిగా ఆర్టీవో కార్యాలయాన్ని కోరుతారు. వారు ధరలు నిర్ణయించాక వేలం ప్రకటిస్తారు. తీరా వేలం వేసే నాటికి ఇనుముగా తప్ప ఇంక దేనికీ పనికిరాకుండా పోతున్నాయి. ఇట్లా లారీలు, వ్యాన్‌లు, ఆటోలు, కార్లు కుప్పలు తెప్పలుగా పడివుంటున్నాయి. భాకరాపేట ఘాట్‌లో అయితే ఈ వాహనాలను మట్టిలో కలిపేస్తూ ఒక అడవే పెరిగింది.

రూ.30 కోట్ల ఆదాయం మటాష్!

దర్యాప్తులో వేగం పెంచి, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో వ్యవహరిస్తే పట్టుబడిని ఏడాదిలోనే ఈ వాహనాలను వేలం వేసే అవకాశం ఉంటుంది. ఇలా చేయగలిగితే ప్రభుత్వానికి భారీ ఆదాయం కూడా లభిస్తుంది. తిరుపతి డివిజన్ పరిధిలో 2000 నుంచి గతేడాది చివరి వరకూ స్వాధీనం చేసుకున్నవే వెయ్యి వాహనాలదాకా ఉన్నాయి. పట్టుబడిన ఏడాదిలోగా వేలం వేయగలిగితే సగటున ఒక వాహనం రెండు నుంచి మూడు లక్షలకు అమ్ముడయ్యే అవకాశం ఉంటుంది. అంటే దాదాపు 20 నుంచి 30 కోట్ల రూపాయల ఆదాయం లభించేది.



భాకరాపేట ఘాట్ పక్కన తుక్కుగా మారిన వాహనాలు

దర్యాప్తు తుప్పు వదిలితే కోట్ల ఆదాయం

- స్వాధీనం చేసుకున్న వాహనాలను ఎక్కడపడితే అక్కడ కాక భద్రతగల ప్రత్యేక ప్రాంతాల్లో పార్క్ చేయాలి.
- పట్టుబడిన వాహనాల ప్రతి పార్ట్‌నూ వీడియో రికార్డు చేయచ్చు.
- అసలు యజమానులను గుర్తించే ప్రక్రియకు ఏడాదికి మించకుండా గడువు
- చార్జ్‌షీట్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి.
- ప్రత్యేక కోర్టుల ద్వారా కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలి.



చేతివాటమూ ఘనమే

పట్టుబడిన వాహనాల్లోంచి ముఖ్య భాగాలు మాయమైపోతుంటాయి.ముందుగా మాయమ య్యేది బ్యాటరీలు. వాటి స్థానంలో పనికిరాని బ్యాటరీలు ప్రత్యక్షమవుతాయి. కొన్ని వాహనా లకైతే ఏకంగా ఇంజన్లే మాయమైపోతుం టాయి. మానిటర్లూ, జీపీఎస్‌లూ వంటివి అయితే అసలు మిగలవు. ఎలాగూ ఇప్పట్లో తేలే వ్యవహారం కాదు కాబట్టి ఇంటి దొంగలే చేతివాటం ప్రదర్శిస్తుంటారని తెలుస్తోంది.

20న 153 వాహనాల వేలం

తిరుపతి డివిజన్ పరిధిలో పట్టుబడిన 153 వాహనాలను ఫిబ్రవరి 20వ తేదీన కపిలతీర్థం వద్ద జిల్లా అటవీ అటవీ శాఖ కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నారు. ఆ తర్వాత మరో 200 వాహనాలకు కూడా బహిరంగ వేలం వేయనున్నట్లు సమాచారం.



ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



తిరుమల, జనవరి30 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. తిరుపతికి చెందిన బ్లిస్ హోటల్స్ గ్రూప్ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి దంపతులు విరాళం చెక్‌ను అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈకార్యక్రమంలో బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి కూడా ఉన్నారు.

శ్రీకాళహస్తి రూరల్ సీఐ వాహనం బోల్తా

- సీఐతో పాటు డ్రైవర్‌కు తీవ్రగాయాలు



తిరుపతి(నేరవిభాగం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఉప్పరపల్లి సమీపంలో శ్రీకాళహస్తి రూరల్ సీఐ వాహనం గురువారం రోడ్డుకు ఎడమ వైపున బోల్తా పడింది. రోడ్డుపై వస్తున్న ఆవులను తప్పించబోయే క్రమంలో అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. సీఐతో పాటు డ్రైవర్‌కూ తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఎస్పీ కార్యాలయంలో అధికారిక పనుల నిమిత్తం శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్, సిబ్బంది గురువారం ఉదయం తిరుపతికి వచ్చారు. ఇక్కడ పనులు ముగించుకుని తిరిగి వెళుతుండగా ఒక్కసారిగా ఆవులు రోడ్డుపైకి పరుగెత్తుకుంటూ వచ్చాయి. ఈ ఆవులను తప్పించబోయే క్రమంలో వాహనం రోడ్డుకు ఎడమవైపున పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. వాహనంలోని రూరల్ సీఐ రవినాయక్‌తో పాటు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

నేడు పెళ్లి జరగాల్సి ఉండగా..!

- పది రోజుల కిందట అదృశ్యమైన విద్యార్థిని
- పంబలేరువాగులో లభ్యమైన మృతదేహం



లేహానిస్సి (ఫైల్ ఫొటో)

గూడూరు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అంతా అనుకున్నట్లు జరిగుంటే.. ఆ ఇంట పెళ్లి బాజాలు మోగాల్సింది. శుక్రవారం ఉదయం ఆమె పెళ్లికూతురుగా పీటలమీదకు ఎక్కాల్సి ఉంది. కానీ.. ఆ ఇంట విషాదం నెలకొంది. పది రోజుల కిందట అదృశ్యమైన ఆ విద్యార్థిని.. పంబలేరు వాగులో గురువారం మృతదేహంగా తేలింది. ఈ విషాద ఘటన గూడూరు మండలం పోటుపాళెం సమీపంలో చోటుచేసుకుంది. గూడూరు రూరల్ పోలీసులు తెలిపిన ప్రకారం.. సూళ్లూరుపేటలోని రాఘవయ్యపేటకు చెందిన శామ్యూల్ జయకుమార్, రమాదేవి దంపతుల కుమార్తె లేహానిస్సి(19) గూడూరులోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ రెండో సంవత్సరం చదువుతోంది. ఈమెకు సమీప బంధువుతో ఈ నెల 31వ తేదీ (శుక్రవారం) పెళ్లి నిశ్చయించారు. ఈ క్రమంలో ఈనెల 20వ తేదీన కళాశాలకు వెళ్లిన లేహానిస్సి ఇంటికి రాలేదు. పలుచోట్ల వెదికిన కుటుంబసభ్యులు.. ఆమె కనిపించడం లేదని ఈనెల 21న సూళ్లూరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గూడూరు మండలం పోటుపాళెం సమీపంలోని పంబలేరువాగులో గురువారం లేహానిస్సి మృతదేహం లభ్యమైంది. శుక్రవారం ఉదయం పెళ్లి జరగాల్సి ఉండగా ఆమె మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విద్యార్థిని మృతికి గల కారణాలను పోలీసులు విచారిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించి రూరల్ ఇన్‌చార్జి ఎస్ఐ తిరుపతయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూడుపాముల రవాణా కేసులో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష

- 15 ఏళ్లనాటి కేసులో తీర్పు

సత్యవేడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పూడుపాముల అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలిలా ఉన్నాయి. 2009 జూలై 22వ తేదీన సత్యవేడు మండలం పేరడం గ్రామానికి చెందిన మేకల లక్ష్మయ్య, తమిళనాడు రాష్ట్రం ఊత్తుకోట్టైకు చెందిన రజిని, రాధ.. సత్యవేడు అటవీప్రాంతం నుంచి నాలుగు పూడు పాములు పట్టుకుని అక్రమ రవాణా చేస్తుండగా అప్పటి ఎస్ఐ బీవీ శ్రీనివాసులు పట్టుకున్నారు. పాముల సహా వీరిని అటవీశాఖకు అప్పగించారు. 2022లో అప్పటి ఎఫ్ఆర్‌వో జయప్రసాదరావు అటవీ హక్కులు, వన్యప్రాణి విభాగం చట్టం ప్రకారం చార్జిషీటు దాఖలు చేయగా, ఎఫ్‌బీవో వేణుగోపాల్ ఇందుకు సంబంధించిన సాక్షులను ప్రవేశ పెట్టారు. నేరం నిరూపణ కావడంతో ముగ్గురు నిందితులకు ఏడాది జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ ఇన్‌చార్జి న్యాయమూర్తి గోపాలకృష్ణ తీర్పును వెలువరించారు.

ఇద్దరు 'ఎర్ర' దొంగలకు ఐదేళ్ల జైలు

- రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ ఎర్రచందనం అదనపు జిల్లా జడ్జి నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. దీనికి సంబంధించి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. ఎనిమిదేళ్ళ క్రితం తమిళనాడుకు చెందిన కె.మణి, పి.దొరస్వామి ఎర్రచందనం అక్రమంగా తరలిస్తూ నాగపట్ల బీట్ పరిధిలోని చామల రేంజ్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. దీనిపై విచారించి కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. దీంతో ప్రస్తుతం ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎస్పీ శ్రీనివాస్ కేసులో ఎప్పటికప్పుడు ప్రగతి నివేదికలపై సమీక్షిస్తూ సూచనలు జారీ చేశారు. సాక్ష్యాధారాలు కోర్టుకు హాజరుపరచడం మొదలు నిందితులకు జైలు శిక్ష పడేలా విశేష కృషి చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. దీంతో పోలీసు బందోబస్తు మధ్య నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

ఎల్ఎల్‌బీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో గతేడాది ఆగస్టు-సెప్టెంబరు నెలల్లో నిర్వహించిన సీబీసీఎస్, నాన్ సీబీసీఎస్ ఎల్ఎల్‌బీ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. మూడేళ్ల ఎల్ఎల్‌బీ నాల్గవ సెమిస్టర్, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ నాలుగు, ఎనిమిది సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేశారు. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపర్చినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు వాయిదా

- ఉత్తర్వులు జారీ చేసిన వీసీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఫిబ్రవరి 3వ తేదీ నుంచి నిర్వహించాల్సిన దూరవిద్యా పరీక్షలు వాయిదా వేసినట్లు వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని రాక

- తిరుపతిలో కూటమి పార్టీల నేతలతో సమావేశం
- రేపు శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

తిరుపతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ శుక్రవారం తిరుపతికి రానున్నారు. గురువారం కలెక్టరేట్‌కు అందిన సమాచారం ప్రకారం.. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు తిరుపతి చేరుకుని తిరుచానూరు రోడ్డులోని ఓ హోటల్‌లో బస చేస్తారు. అక్కడ జిల్లా ఎమ్మెల్యేలు, కూటమి పార్టీల నేతలతో సమావేశమవుతారు. ఖాళీగా ఉన్న తిరుపతి డిప్యూటీ మేయర్ పదవికి ఫిబ్రవరి 3న ఎన్నిక జరగనున్న నేపథ్యంలో దీనిపై కూటమి పార్టీల నేతలతో చర్చించే అవకాశముంది. శనివారం ఉదయం శ్రీకాళహస్తి చేరుకుని పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఆలయ ఈవో బాపిరెడ్డి తదితరులతో సమావేశమై సమీక్షించనున్నారు.

సబ్ జైళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో జిల్లా అధికారులు ఆ మేరకు పనులకు సిద్ధమయ్యారు. తిరుపతి, సత్యవేడు, శ్రీకాళహస్తి సబ్ జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. తిరుపతిలో 10 నుంచి 12, సత్యవేడులో 10, శ్రీకాళహస్తిలో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

రేపు ఇంటింటా పింఛన్ల పంపిణీ

- లబ్ధి పొందనున్న 2,63,191మంది

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫిబ్రవరి నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను శనివారం ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. పింఛన్ల పంపిణీపై జిల్లా అధికారులతో ఆయన గురువారం టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. శుక్రవారం బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకుని శనివారం ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయాలన్నారు. 2వ తేదీ ఆదివారం కావడంతో మిగిలిన వారికి 3వ తేదీ పంపిణీ చేయాలని ఆదేశించారు.జిల్లాలోని 691సచివాలయాల పరిధిలో 2,63,191 మందికి ప్రభుత్వం రూ.112.19 కోట్లు మంజూరు చేసిందన్నారు.

ప్రాణదాన పథకానికి 194 మంది ఎంపిక



ప్రాణదాన కమిటీలో రోగులను ఎంపిక చేస్తున్న కమిటీ సభ్యులు

తిరుపతి(వైద్యం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో పేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు టీటీడీ నిర్వహిస్తున్న ప్రాణదాన పథకానికి 194 మందిని ఎంపిక చేశారు. స్విమ్స్‌లో గురువారం డైరెక్టర్ ఆర్వీకుమార్ ఆధ్వర్యంలో ప్రాణదాన కమిటీ సమావేశం నిర్వహించారు. ఆర్థిక స్థోమత లేని అర్హులైన నిరుపేద రోగులను వైద్య విభాగాల వారీగా ఉచిత శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. కార్డియోథొరాసిక్ 18, ఎండోక్రైనాలజీ 1, జనరల్ సర్జరీ 3, మెడికల్ అంకాలజీ 2, మెడిసిన్ 21, నెఫ్రాలజీ 55, న్యూరాలజీ 36, న్యూరో సర్జరీ 19, గైనకాలజీ 2, రేడియేషన్ అంకాలజీ 5, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ 29, సర్జికల్ అంకాలజీ 2, యూరాలజీ 1 చొప్పున ఎంపిక చేశారు. ప్రాణదాన పథకానికి దాతలు అండగా నిలవాలని డైరెక్టర్ ఆర్వీకుమార్ కోరారు.

శ్రీవారి సేవలో కేంద్రమంత్రి కుమారస్వామి

తిరుమల, జనవరి30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలో జరిగిన తోమాల సేవలో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



పుత్తూరు వార్తలు

పెద్దిరెడ్డి.. అక్రమ సంపాదనను

ఖజానాకు జమ చేయండి: భాను

పుత్తూరు అర్బన్, జనవరి30(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో గుంతల రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతుంటే.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రం ప్రభుత్వ నిధులతో బీటీ రోడ్డు, పెద్ద నిర్మాణం చేపట్టారంటూ నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆరోపించారు. పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై గురువారం ఆయన వీడియో విడుదల చేశారు. ఆక్రమించిన భూములను, అక్రమ సంపాదనను స్వచ్ఛందంగా ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలన్నారు. జగన్ కు ఏమాత్రం తీసిపోకుండా పెద్దిరెడ్డి అక్రమ సామ్రాజ్యం విస్తరించారని ఆరోపించారు. వీరిదాడేని తలపించేలా సీఎం పట్ల మాట్లాడటాన్ని తీవ్ర స్థాయిలో తప్పుబట్టారు. భూ ఆక్రమణలు నిజమని తేలితే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు. 75 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించి, దర్జాగా అడవిలోకి రోడ్డు వేసుకుని విలాసవంతమైన గెస్ట్ హౌస్ కట్టారని విమర్శించారు. అవసరం లేకున్నా ప్రాజెక్టుల పేరిట ఊర్లు ఖాళీ చేసి ప్రజలు ఉసురు పోసుకున్నారన్నారు. పెద్దిరెడ్డి అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టి శిక్ష పడేలా ప్రభుత్వం చేస్తుందన్నారు.

ఆదాయం పెంచుకొని

సమస్యలు పరిష్కరించుకోవాలి

పుత్తూరు టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీలు ఆదాయం పెంచుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు. ఎంపీపీ మునివేలమ్మ అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా సొంతంగా ఆదాయ వనరుల సమకూర్చుకోవాలని సూచించారు. వేసవిలో చాలా మంది సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడుతుంటే వైద్య సిబ్బంది పట్టించుకోకపోవడం సరికాదని ఎంపీపీ మునివేలమ్మ అన్నారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చే స్థలాలకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని డీటీ అశోక్‌రెడ్డి తెలిపారు. పీఎం సౌర విద్యుత్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు పరికరాలను ఉచితంగా అందిస్తామని విద్యుత్ శాఖ ఏఈ సాయికుమార్ చెప్పారు. పంచాయతీ విస్తరణ అధికారి దేవిక మాట్లాడుతూ నూతనంగా భవన నిర్మాణాలకు పంచాయతీ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. వీఎస్ఎన్ పురం గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మునిస్వామిరెడ్డి, విమలమ్మ, ఏవో కోదండయ్య, హెచ్ఓ వెంకటస్వామి జన్మ హౌసింగ్ అధికారి సురేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎంపీపీ మునివేలమ్మ

శాస్త్రోక్తంగా ప్రసన్న వెంకటేశ్వరుడి కల్యాణోత్సవం

వడమాలపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంట లోని ప్రసన్న వెంకటేశ్వరుని ఆలయంలో గురువారం శ్రీవారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణ సందర్భంగా కమలనాదుని కల్యాణం నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. పద్మావతి, ఆండాళ్ సమేత ప్రసన్నవెంకటేశ్వర స్వామివారిని పట్టు పీతాంబరాలు, పూలమాలలతో నూతన వధూవరులుగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్య కుమారాచార్యులు ఆధ్వర్యంలో గణపతి, అగ్నిహోమం చేపట్టారు. మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ వేదమంత్రాలతో మాంగల్యధారణ చేయించారు. మహా మంగళ హారతు లిచ్చారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



పుస్తకాల వితరణ

వడమాలపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాల సోషియల్ ఉపాధ్యాయులు సురేంద్ర తమ పాఠశాలకు గ్రంథాలయ పుస్తకాలు వితరణగా అందజేశారు. కవి, వక్త, రచయిత అయినా సురేంద్ర తన రచనలతో పాటు విద్యార్థులకు జ్ఞానాన్ని అందించే సుమారుగా వంద పుస్తకాలను వితరణగా అందజేశారు.

వాట్సప్ ద్వారా ప్రభుత్వ సేవలు

పుత్తూరు అర్బన్, జనవరి30(ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొదటిసారిగా వాట్సప్ ద్వారా ప్రజా సేవలు అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. వాట్సప్ ద్వారా ప్రస్తుతం 161 సేవలను ప్రజలు వినియోగించుకునే వెసలుబాటును కల్పించారన్నారు. మరికొన్ని రోజుల్లో 350 సేవలు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంత్రి నారా లోకేశ్ వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఈ సేవలు ప్రారంభించారని తెలియజేశారు. 9552300009 నంబర్‌కు వాట్సప్ మెసేజ్ పంపడంతో ఆర్టీసీ బస్ టికెట్, ప్రముఖ ఆలయాల దర్శన టికెట్లు, వసతి సౌకర్యాలు, రెవెన్యూ శాఖలోని 1బి, అడంగల్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, పోలీస్ తదితర సేవలు పొందవచ్చని వివరించారు. ఈ మేరకు ఎమ్మెల్యే గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందన



పుత్తూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడ ఇందిరాగాంధీ మైదానంలో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల కవాతులో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అభినందించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బీకామ్ విద్యార్థులు శేషాద్రి, షణ్ముగం, బీబీఏ విద్యార్థి లావణ్య రిపబ్లిక్‌లో పాల్గొన్నారు. గురువారం వారిని అభినందించారు. ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఆంక్షలతో కూడిన అనుమతులు ఇచ్చాం



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

కోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి స్వర్ణముఖినదిలో గల ఇసుకరీచ్, విద్యానగర్‌లోని ఇసుక డంపింగ్‌యార్డ్‌లను గురువారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నదిలో రీచ్ ఉండే ప్రదేశాన్ని పరిశీలించారు. ఇక్కడ రీచ్‌కు మరో 15 రోజుల వరకు తవ్వకాలు చేపట్టేందుకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. 15 రోజుల తరువాత ఇసుక తవ్వకాలు జరుపుతామన్నారు. ఈ తవ్వకాలలో జేసీబీ, హిటాచీలను వాడరాదని, టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా చేయకూడదని కఠినమైన ఆంక్షలు విధించామన్నారు. స్థానికంగా గూడలి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు వచ్చి రీచ్‌లో తమకు జీవనోపాధి కల్పించాలని కోరారు. దీనిపై కూడా పరిశీలిస్తామని రాఘవేంద్రమీనా తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జయజయరావు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్ఐ మధులత, వీఆర్వోలు మైనింగ్ అధికారులు ఉన్నారు.

మోడల్ పాఠశాలల ఎంపిక పై తనిఖీలు

కోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు, కేశవరం, ఊనుగుంటపాళెం, రుద్రవరం, గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను గురువారం తహసీల్దారు జయజయరావు తనిఖీ చేశారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా ఆదేశాల మేరకు ఆయా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన చేసి మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేసేందుకు గాను ఈ తనిఖీలు నిర్వహించారు. మండలంలోని కొన్ని పాఠశాలలను ఎంపిక చేసుకొని, వాటిలో కొన్నింటిని ఉత్తమమైనవిగా ఎంపిక చేసి ఆధునాతన వసతులు కల్పిస్తామన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

దంపతులకు గాయాలు



గాయాలుపాలైన శాలిని

నారాయణవనం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ద్విచక్రవాహనంలో వెళుతున్న రేణిగుంటకు చెందిన భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రేణిగుంట నుంచి ఉత్తుకోట వైపు ద్విచక్రవాహనంలో జయలదేరిన మోహన్‌బాబు, ఆయన భార్య శాలిని మండల పరిధిలోని సముదాయం వద్ద చెన్నై నుంచి పుత్తూరుకు వెళుతున్న గుర్తుతెలియని కారు ఢీకొంది. దంపతులు కిందపడి గాయాలపాలయ్యారు. స్థానికులు వారిని పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గువ్వల దోబీ కాలనీ భూ నిర్వాసితులకు

రూ.14కోట్ల పరిహారం మంజూరు



భూ నిర్వాసితులతో చర్చిస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

రేణిగుంట, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : గువ్వల దోబీ కాలనీ భూ నిర్వాసితులకు పరిహారం కింద రూ.14 కోట్లు మంజూరైంది. చెన్నయ్ -తిరుపతి బైపాస్ లైన్ నిర్మాణంలో భాగంగా పలువురి రైతుల నుంచి భూసేకరణ చేపట్టారు. అందులో భాగంగా 51 కుటుంబాలకు పరిహారం మంజూరైందని అధికారులు చెప్పారు. ఈ భూ నిర్వాసితులకు పరిహారంతోపాటు కాటన్ మిల్లు వద్ద రూ.5 కోట్లకు భూములు కొనుగోలు చేసి మూడు సెంట్ల చొప్పున పంపిణీ చేయనున్నారు. ఆ మేరకు నిర్వాసితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మురళీ కృష్ణ ఎస్ఐ సుధాకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయకృష్ణ తదితరులు గురువారం చర్చించారు.

టీడీపీ నాయకుడికి నివాళి



శ్రీకాళహస్తి,జనవరి 30(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం దిగువకనతనేరి పంచాయతీ గాంధీసెంటర్‌కు చెందిన టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు వెంకటరత్నం బుధవారం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. స్వగ్రామానికి చేరిన మృతదేహానికి టీడీపీ మండలాధ్యక్షుడు గాలి మురళీనాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పోలీసు హెచ్చరికనూ

లెక్కచేయని మద్యం ప్రియులు

వెంకటగిరిటౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మైపాడు ఆస్పత్రిలో పలువురు మద్యం, గంజాయి సేవిస్తున్నారన్న సమాచారం రావడంతో సీఐ ఏవీ రమణ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇక్కడ మద్యపానం, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ బోర్డు ఏర్పాటు చేశారు. అయినా మద్యం ప్రియులు దానిని లెక్క చేయకుండా అక్కడే మద్యం తాగుతున్నారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన మైపాడు ఆస్పత్రి ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు మైపాడు ఆస్పత్రిపై నిఘా పెట్టి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆ స్థలంలోనే వినియోగించి పడేసిన మద్యం సీసాలు, గ్లాసులు



పోలీసు వారి హెచ్చరిక బోర్డు

క్షణికావేశం...

● కర్రతో దాడిచేసి అన్నను చంపిన తమ్ముడు

కోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కోట మండలం జరుగుమల్లి గమళ్లపాళెంలో గురువారం క్షణికావేశంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగి తమ్ముడు కర్రతో దాడిచేయడంతో అన్న కోమారి కోటయ్య (46) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు జరుగుమల్లి గమళ్లపాళెంకు చెందిన కోమారి కోటయ్య, మస్తానయ్యలు స్వయాన అన్నదమ్ములు. ఇద్దరు పక్కపక్కనే నివాసం ఉంటున్నారు. తమ్ముడు మస్తానయ్య భార్య ఇంటివద్ద బట్టలు ఉతుకుతుండగా వచ్చే మురుగునీరు అన్న కోటయ్య ఇంటిపైకి వెళ్తుండటంతో తోడి కోడళ్లు గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో కోటయ్య, మస్తానయ్య అన్నదమ్ములు ఇరువురు భార్యల తరఫున జోక్యం చేసుకోవడంతో వివాదం తారాస్థాయికి చేరుకుంది. దీంతో రెచ్చిపోయిన తమ్ముడు మస్తానయ్య అక్కడే ఉన్న తండ్రి వెంకయ్య చేతిలోని కర్రను తీసుకొని అన్న కోటయ్య తలపై బలంగా మోదాడు. దీంతో కోటయ్య స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోటయ్యను కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని కోటయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఒకే తల్లికి జన్మించిన అన్నదమ్ములు చిన్నపాటి విషయమై క్షణికావేశంలో అన్నను తమ్ముడు చంపడంతో జరుగుమల్లిలోని గమళ్లపాళెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అన్నను కర్రతో దాడిచేసి చంపిన మస్తానయ్య పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.



కోటయ్య మృతదేహం (ఇన్‌సెట్లో) ఫైల్‌ఫొటో)

ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన మహాత్మాగాంధీ



గాంధీ చిత్రపటం వద్ద నాయుడుపేటలో నెలవల సుబ్రహ్మణ్యం - గూడూరులో సీపీఎం నేతల నివాళులు

నాయుడుపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అహింసా వాదంతో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన మహనీయుడు మహాత్మా గాంధీ అని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా నాయుడుపేటలో ఆయన చిత్రపటానికి నెలవల సుబ్రహ్మణ్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంది కృష్ణయ్య, గూడూరు సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, సుజాతమ్మ, కన్నెమ్మ, గోపాలకృష్ణ ఉన్నారు.

గూడూరు: స్థానిక బజారువీధిలోని గాంధీ విగ్రహానికి సీపీఎం నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో జోగి శివకుమార్, మణి, బీవీ రమణయ్య, ప్రసాద్, చంద్రయ్య, మదన్ తదితరులు పాల్గొన్నారు. ఆదివారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించగా, సోమిశెట్టి చెంచురామయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటగిరిటౌన్: పట్టణంలోని తూర్పువీధిలో ఉన్న గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి అంజయ్య ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అదే విధంగా వెలమ పాళెంలో డిల్లీబాబు ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలయ్య గౌస్ బాషా, హనుమంతు, తాజుద్దీన్, మునయ్య, ముని బాబు, చంద్రశేఖర్, సతీష్, కాంతారావు పాల్గొన్నారు.

వాకాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అన్నపూర్ణమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రామయ్య, డీటీ సందీప్, ఆర్ఐ అఖిల్, పాఠశాలల్లో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెళ్లకూరు: పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ యువరాజు, ఎంఈవో మిండల శంకరయ్య గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆర్ఐ సంతోష్ బాబు, వీఆర్వోలు వంశీకృష్ణ, మోబీనా పాల్గొన్నారు.

కోట: కోట పట్టణంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆవుల సుబ్బయ్య ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సంస్థల నేతలు, వీఐడీసాయి ఆక్షయసేవాసమితి ప్రతినిధులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

● కిసాన్ మేళాలో అధికారులు, శాస్త్రవేత్తలు



స్టాల్‌లో విద్యార్థులతో నిమ్మపైన పరిశోధన సిబ్బంది

డక్కిలి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సరైన యాజమాన్య పద్ధతులు, జాగ్రత్తలతో అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు, శాస్త్రవేత్తలు సూచించారు. వెంకటగిరి నియోజకవర్గం డక్కిలిలో గురువారం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట(అన్నమయ్య జిల్లా) ఉద్యాన కళాశాల విద్యార్థులు, పెట్లూరు నిమ్మ పరిశోధన స్థానం సంయుక్తంగా రైతు సదస్సు నిర్వహించారు. ఉద్యాన కళాశాలలో బీఎస్సీ ఉద్యాన కోర్సు నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా డక్కిలిలో 83మెలులుగా రైతులతో కలిసి ఉద్యాన పంటల సాగును పరిశీలించారు. పంటల సాగు మెలకువలు నేర్చుకున్నారు. తాము నేర్చుకున్న అంశాలపై గురువారం రైతుసదస్సు, ఉద్యాన పంటల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీటీ శ్రీనివాస్ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెట్లూరు నిమ్మ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి, ఉద్యాన కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ వై.శిరీష, మండల ఉద్యాన శాఖ అధికారి ఆనంద్, ఉద్యాన కళాశాల ఏడీఆర్ డాక్టర్ బీహరిమల్లికార్జున రెడ్డి, నిమ్మ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కాండర్ నాయక్, ఎంఈవో, ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగరాజు ప్రసంగించారు. రైతులు సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. తగిన సూచనలు చేశారు.

ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపులకు

గిరిజనుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న ప్రకాష్

దొరవారిసత్రం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ వేధింపులకు గిరిజనుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన దొరవారిసత్రం మండలం బుడూరులో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బుడూరు గిరిజన కాలనీకి చెందిన చెంబేటి ప్రకాష్ వ్యవసాయ కూలీ. తన ఇంటిపై ఏపీఎస్ ఫైనాన్షియల్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ నుంచి యేడాది క్రితం రూ.4 లక్షలు రుణం పొందాడు. ప్రతి నెలా రూ.8 వేలు చెల్లిస్తున్నాడు. మూడు నెలల నుంచి పనులు లేక డబ్బులు చెల్లించక పోవడంతో ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది బుధవారం ఇంటికి వచ్చి గొడవ పడటంతో మనస్తాపానికి గురైన ప్రకాష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు బంధువులు తెలిపారు. గమనించిన బంధువులు అతడిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉన్నట్లు చెప్పారు. ఆస్పత్రి వర్గాల నుంచి దొరవారిసత్రం పోలీసులకు సమాచారం రావడంతో వారు బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. అయితే ఈ వ్యవహారాన్ని కేసుల వరకు పోనీయకుండా ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులు మంతనాలు చేస్తున్నట్లు సమాచారం.

వేడుకగా శ్రవణం ఉత్సవం



మాడవీధుల్లో ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న

నారాయణవనం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నారాయణ వనంలోని వెలసిన పద్మావతీ సమేత కళ్యాణ వెంకటేశ్వరుడి ఆలయంలో గురువారం శ్రవణ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం స్వామివారి నక్షత్రమైన శ్రవణం సందర్భంగా ఉభయ నాంచారులతో కళ్యాణ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యపూజలు జరిపించారు. ప్రత్యేక పుష్పాలతో, స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయనాంచారులతో స్వామివారిని మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఉపవాస దీక్షతో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, సీనా భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు



ఆలయంలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వచ్చే నెల జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఆలయంలో పలు విభాగాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో కంటే సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మొబైల్ టాయిలెట్లు, తాగునీరు, వైద్య ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, డీఎస్పీ నరసింహమూర్తి, నాయకులు చెంచయ్యనాయుడు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

హనుమంతు వాహనంపై వీరరాఘవస్వామి

నారాయణవనం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక కసకపల్లి, వేదవల్లి సమేత వీర రాఘవస్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారు హనుమంతు వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం దీపారాధన ఉత్సవంలో మహిళలు మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం కనకవల్లి, వేదవల్లి సమేత స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, హనుమంత వాహనంపై ఊరేగించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.



విద్యుదాఘాతంతో గృహోపకరణాలు దగ్ధం

రోడ్డున పడ్డ ఒంటరి వృద్ధురాలు

శ్రీకాళహస్తి, జనవరి30(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఇంట్లోని వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. ఒంటరిగా జీవించే వృద్ధురాలు రోడ్డున పడింది. శ్రీకాళహస్తి పట్టణ శివారు కాగితాల ఆరుంధతివాడకు చెందిన లక్ష్మమ్మ(60) ఇళ్లల్లో పనిచేసుకుంటూ పొందుపై ఆధారపడి జీవనం సాగిస్తోంది. గురువారం పనికి వెళ్లిన సమయంలో ఇంట్లో విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయి. ఇంట్లోని వస్తువులు మొత్తం పూర్తిగా కాలిపోయాయి. కట్టుబట్టలతో వృద్ధురాలు రోడ్డున పడింది.



జపాన్ రాయబారితో శ్రీసిటీ ఎండీ సమావేశం



ఒకో కెయిచిని సన్మానిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకాహషి ఆహ్వానం మేరకు భారతలోని జపాన్ రాయబారి ఒకో కెయిచి ఆధ్వర్యంలో చెన్నైలో నిర్వహించిన స్వాగత కార్యక్రమానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి రాయబారిని ఘనంగా సన్మానించారు. శ్రీసిటీ గురించి ఆయనకు వివరించారు. జపనీస్ తయారీ దారులు తమ ప్రధాన వ్యాపార గమ్యస్థానంగా శ్రీసిటీని ఎంపిక చేసుకునేందుకు ఈ ఆటో ఎక్స్‌పో తమకు ఓ అద్భుత వేదిక అని ఆయన పేర్కొన్నారు.

మేరీ వృద్ధాశ్రమానికి చేయూత

నాయుడుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రాజీవ్ గాంధీకాలనీలోని మేరీ వృద్ధాశ్రమం వృద్ధులకు వాటర్ కూలర్, నిత్యావసర సరుకులను గురువారం కొండవీటి రామచంద్రరావు జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు సీటీవో రవికుమార్ అందజేశారు. వృద్ధుల నడుమ కేక్ కట్‌చేసి అందరికి పంపిణీ చేశారు. వృద్ధులను ఆదరిస్తున్న సునీత జెస్సీలను ప్రత్యేకంగా అభినందించారు.

ఆటలు మానసిక వికాసాన్ని కలిగిస్తాయి



బహుమతి అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆటలు విద్యార్థులకు మానసిక, శారీరక వికాసాన్ని కలిగిస్తాయని ఇంటర్మీడియట్ బోర్డు వికేషనల్ కారి, పాపా నాయుడుపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులకు ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పలుపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెటకాస్ విద్యానిలయం అధినేత విజయశేఖర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంధ్యాల వెంకటసుబ్బమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏర్పేడు పీహెచ్‌సీ తనిఖీ



శ్రీకాళహస్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు పీహెచ్‌సీని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

'ముక్కంటి' ఆలయ అధికారులపై మంత్రి లోకేశ్ సీరియస్

● విధుల నుంచి మహిళా సెక్యూరిటీ గార్డు తొలగింపు

శ్రీకాళహస్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో క్యూలైన్‌లో నిరీక్షించే భక్తులకు ఉచిత ప్రసాదం ఇవ్వకుండా అడ్డదారిలో వచ్చిన వారికి ఇష్టానుసారంగా ఇవ్వడంపై ప్రశ్నించిన వారితో సిబ్బంది దురుసుగా ప్రవర్తించడంపై మంత్రి నారా లోకేశ్ సీరియస్‌గా స్పందించారు. రెండు రోజుల కిందట దేవాలయాల్లో భక్తులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫిర్యాదులు చేసేందుకు వీలుగా క్యూఆర్‌కోడ్ ప్రవేశపెట్టారు. 'ఉచిత ప్రసాదం కౌంటర్ వద్ద క్యూలైన్‌లో నిలబడిన వారికి ప్రసాదాలు ఇవ్వకుండా అయినవారికి పెద్దసంచిలో ఇష్టారాజ్యంగా పంపారు. దీనిపై ప్రశ్నిస్తే మమ్మల్ని దురుసుగా ప్రవర్తించారు' అంటూ ఓ భక్తుడు క్యూఆర్‌కోడ్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి నారా లోకేశ్ సీరియస్‌గా స్పందించారు. ట్విట్టర్ ద్వారా ముక్కంటి ఆలయ అధికారుల తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

సీసీకెమెరాల ద్వారా ఉచిత ప్రసాదం కౌంటర్ వద్ద జరిగిన దృశ్యాలను ఈవో బాపిరెడ్డి పరిశీలించారు. భక్తుడుచేసిన ఫిర్యాదు వాస్తవమేనని నిర్ధారించారు. అడ్డదారిలో ప్రసాదం కోసం ఓ వ్యక్తి ప్రవేశించిన సమయంలో నిర్లక్ష్యంగా విధులు నిర్వహించారని ఏఆర్ మణి అనే మహిళా సెక్యూరిటీ గార్డును విధుల నుంచి తొలగిస్తూ ఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

బిల్లులు చెల్లిస్తేనే మీటింగ్‌కు వస్తాం..?

వైసీపీ వార్డు మెంబర్ల అల్టిమేటం

రేణిగుంట, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : తాము చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తేనే ఈ సారి జరిగే పంచాయతీ బోర్డు జనరల్ బాడీ సమావేశానికి వస్తామని వైసీపీ వార్డు మెంబర్లు తేల్చిచెప్పినట్లు తెలిసింది. పంచాయతీ కార్యాలయంలో గురువారం వార్డు సభ్యుల సర్వసభ్య సమావేశం జరిగింది. సర్పంచ్ నాగేశం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి 19 మంది వార్డు సభ్యులుండగా 12 మంది మాత్రమే హాజరయ్యారు. వైసీపీ హయాంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లుల బకాయిలు చెల్లించకపోవడంతోనే ఆ పార్టీకి సంబంధించిన వార్డు సభ్యులు సమావేశానికి గైర్హాజరైనట్లు చెబుతున్నారు. దీంతో కోరం లేక సమావేశం వాయిదా వేసినట్లు రికార్డుల్లో నమోదు చేయాల్సి వచ్చింది.

మహాశివరాత్రికి సేవలందించండి



అపోలో వైద్యులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు అపోలో ఆస్పత్రి తరఫున సేవలందించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కోరారు. చెన్నైలోని అపోలో మెయిన్ బ్రాంచ్‌లో సీఈవో నవీన్, సీనియర్ వైద్యులను గురువారం ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిబ్రవరి 21 నుంచి మార్చి 4వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఈ నేపథ్యంలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి శిక్షణ పొందిన వైద్యసిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన వైద్యపరికరాలను అందించాలని కోరారు. అందుకు అపోలో సీఈవో సానుకూలంగా స్పందించారు. వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి అత్యవసర వైద్యానికి వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బందిని నియమిస్తామన్నారు. అందుకు ఎమ్మెల్యే వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్, రవిరెడ్డి పాల్గొన్నారు.

శ్మశాన సమస్య పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే

పిచ్చాటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరువాయి పాత దళితవాడకు శ్మశాన సమస్యకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే ఆదిమూలం తెలియజేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం గ్రామస్తులు ఆయనకు శ్మశాన సమస్యను వివరించారు. స్పందించిన ఆయన వెంటనే కలెక్టర్‌తో, తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఓ రైతు నుంచి భూమి సేకరించి కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు తెలియజేశారు. ఆ రైతుకు నష్టపరిహారం ఇప్పించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. దీంతో వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, అడవి శంకరాపురం ఆయకట్టు చైర్మన్ పద్దు రాజు, ప్రకాష్ నాయుడు, జయచంద్రనాయుడు, ఎస్సీసెల్ అధ్యక్షుడు అరుళ్‌ప్రకాష్, నీరువాయి గ్రామ సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో..వంటమాస్టర్‌కు తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొనడంతో కిషోర్(28) అనే వంటమాస్టర్ తీవ్రంగా గాయపడ్డాడు. నాయుడుపేట సమీపంలోని రాజుపాళెంకు చెందిన కిషోర్ వంటమాస్టర్‌గా పనిచేస్తుంటాడు. ఇతని అన్నకుమారుడు శీను(15) 9వ తరగతి చదువుతున్నాడు. ద్విచక్రవాహనంపై సొంత పనుల నిమిత్తం కిషోర్ శీనును వెంటబెట్టుకుని గురువారం శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరుకు వచ్చాడు. తిరిగి ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి బయలుదేరారు. మార్గమధ్యంలో శ్రీకాళహస్తి మండలం దొమ్మరపాలెం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో వీరి వాహనాన్ని ఢీకొంది. గాయపడ్డ వారిని స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శీను స్వల్పంగా, కిషోర్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రథమ చికిత్స అనంతరం కిషోర్‌ను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

చేనేత క్లస్టర్లకు అనుమతి హర్షణీయం

వరదయ్యపాళెం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పది చేనేత క్లస్టర్లకు కూటమి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం హర్షణీయమని బీజేపీ నాయకుడు గుత్తి త్యాగరాజు అన్నారు. మంగళగిరిలోని రాష్ట్ర వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావును గురువారం కలిసి సత్కరించారు. జక్కుల శివానందం పాల్గొన్నారు.

పరశురామేశ్వరుని సేవలో కర్ణాటక నేత

శ్రీకాళహస్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వర స్వామిని గురువారం కర్ణాటక ప్రతిపక్ష నాయకులు నారాయణస్వామి దర్శించు కున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి పాల్గొనానరు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సచివాలయ కార్య దర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2025-26కు స్వయం ఉపాధి కల్పన పథకం ద్వారా బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై రుణాలు మంజూరు చేసిందన్నారు. గురువారం నుంచి వచ్చే నెల ఫిబ్రవరి 7వ తేదీలోపు అర్హులైన వారంతా ఆయా సచివాలయాలలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఈవోపీఆర్డీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డిపోలో ఆకస్మిక తనిఖీలు



శ్రీకాళహస్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోను డీపీటీవో నరసింహులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫైర్ బస్సులను తనిఖీ చేశారు. కార్గో సర్వీసు వద్ద వినియోగదారులతో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. వారు సంతృప్తికరంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు చిట్టెమ్మ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గాంధీకి ఘన నివాళి



శ్రీకాళహస్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ కరీముల్లా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేవతి, షేక్ అన్సర్, షేక్ జులేషా, షేక్ అస్లంబాషా, హమీద్ పాల్గొన్నారు. కాగా ఇనగలూరులో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గాంధీజీకి నివాళులు అర్పించారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



శ్రీకాళహస్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీయే ప్రభుత్వ పురుషుల కళాశాలలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు, వైస్ ప్రిన్సిపాల్ నరసింహవర్మ మాట్లాడుతూ పురుషుల్లో 14-18శాతం, స్త్రీలలో 12-16 శాతం హిమోగ్లోబిన్ ఉండాలన్నారు. అంతకు మించి తగ్గితే రక్తహీనత వస్తుందన్నారు. వైద్యులు రెడ్డి రూపేష్, సుజాత, ఆశా వర్కర్, ఏఎన్ఎం, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యా ర్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ అన్నారు. పట్టణంలోని బాబు అగ్రహారం పురపాలక ఉన్నతసంఘ పాఠ శాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, మరుగుదొడ్లను పరిశీలించారు. ఎంఈవో బాలయ్య, టీడీపీ నాయకులు రమేష్, మల్లీశ్వరమ్మ, బాలు, డిల్లీబాబు, టీచర్లు పాల్గొన్నారు.

ఓపీ కావాలంటే ఓపిక ఉండాలి

● కుర్చీలు లేక నిలబడలేక నేలమీదే కూర్చుంటున్న రోగులు
● శ్రీకాళహస్తి ఆస్పత్రిలో ఇదీ పరిస్థితి





శ్రీకాళహస్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కుర్చీలు లేక రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఆస్పత్రిలోని ఓపీ విభాగం వద్దకుర్చీలు లేకపోడంతో రోగులు గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. అలాగే పలు విభాగాల వద్ద కుర్చీలు లేకపోవడంతో వృద్ధులు, మహిళలు, చంటిబిడ్డలతో వచ్చే బాలింతలు అవస్థలు పడుతున్నారు. నిరీక్షించలేక పలువురు నేలపై కూర్చుంటున్నారు. ఓపీ కావాలంటే ఓపిక ఉండాలని చర్చించుకుంటున్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



కుప్పయ్యతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిం చిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ-క్రాప్ చేసిన రైతులందరికీ గిట్టుబాటు ధర కల్పించేలా అధికారులు చర్యలు తీసుకో వాలని ఏవో గౌరికి సూచించారు. అనంతరం సీఎల్ ఎన్‌పల్లి పంచాయతీలో టీడీపీ మైనార్టీ నాయకుడు షరీఫ్ తల్లి ఇటీవల మరణించ డంతో వారింటికెళ్లి ఆయనను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన కుప్పయ్య పూర్తి అంగవైకల్యంతో బాధపడుతుండడంతో పరామర్శించారు. పింఛను రూ.15వేలు వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దారు రాజశేఖర్, టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, కరుణాకర్ నాయుడు, నందకిషోర్‌రెడ్డి, ఉమామహేశ్వరి, మునిభూషణమ్మ, దశరథయ్య, బీజేపీ నాయకులు దిలీప్‌రాయల్, జనసేన నాయకులు చిరంజీవియాదవ్, తులసి, పాల్గొన్నారు.

పదిలో మెరుగైన ఫలితాల కోసం రాత్రి పూట సందర్శన



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న టీచర్లు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పదో తరగత విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధన లక్ష్యంగా కల్లివెట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాత్రిపూట విద్యార్థుల ఇళ్లను సందర్శించే కార్యక్రమాన్ని బుధ వారం రాత్రి చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రూపేష్‌కుమార్ మాట్లాడుతూ ఇంటికి వెళ్లిన తరువాత ఎలా చదువు తున్నా రనే పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. రాత్రి పూట చదివించే బాధ్యతను తల్లి దండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ విధానం వలన మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, నాదెండ్ల మురళి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక



ఎన్నికయిన కమిటీ జాబితాను ఎంపీడీవోకు అందజేస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గ సంఘం ఎన్నికలు ఉమ్మడి రాయలసీమ జిల్లాల పంచాయతీ రాజ్ సర్వీసు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు అధ్యక్షతన గురువారం జరిగాయి. మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ప్రెసిడెంట్‌గా రజనీకాంత్, వైస్ ప్రెసిడెంట్ గురవయ్య, జనరల్ సెక్రటరీగా మునికృష్ణ, కార్యదర్శులుగా ఐశ్వరయ్య, రంగనాథం, జాయింట్ సెక్రటరీలుగా నందిని, లోకమూర్తి, కోశాధికారిగా వెంకటసుబ్బయ్య, ముఖ్య సలహాదారులుగా ఆనందబాబు, సుబ్రమణ్యం, కార్యవర్గ సభ్యులుగా రామకృష్ణ, మురళీమోహన్, నాగరాజు, మునెమ్మ, మునినరేష్‌కుమార్, సాయిమురళి, దక్షిత, ఈశ్వరయ్యలను ఎన్నుకున్నారు. ఈ జాబితను ఎంపీడీవో త్రివిక్రమ్‌రావుకు అందజేశారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

కేవీబీపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలు అందించాలని డీపీఎంవో శ్రీనివాసరావు చెప్పారు. గురువారం పెరిందేశం గ్రామంలోని హెల్త్ క్లినిక్‌ను ఆయన తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీష్, వేణు, వాణి, భారతి, సూపర్ వైజర్ నరేష్, ప్రకాష్, డీపీవో పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజం కోసం కృషి చేద్దాం

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కుష్టు రహిత సమాజం కోసం కృషి చేయాలని వైద్యులు దివాకర్ తెలిపారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది మండల కేంద్రంలో ర్యాలీ చేశారు. కుష్టు వ్యాధిని నిర్మూలిస్తామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విద్యాసాగర్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేధో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం చేశారు. ప్రత్యేక అలంకరణ చేపట్టారు. హారతులు సమర్పిం చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

హుండీలో నగదు చోరీ

పిచ్చాటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు నాగాలమ్మ ఆలయంలో , రెప్పాలపట్టులోని కొత్త నాంచారమ్మ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఆలయాల్లోని హుండీల పగులగొట్టి నగదును దోచుకెళ్లారు.

కళాశాల వద్ద పోలీసుల నిఘా

రేణిగుంట, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : రేణిగుంట అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలో ప్రైవేటు జూనియర్ కళాశాల వద్ద గురువారం పోలీసులు పర్యవేక్షించారు. శ్రీరామ అన్నమాచార్య కళాశాల వద్ద ఈ పర్యవేక్షణ జరిగింది. ఈవ్‌టీజింగ్ నియంత్రణలో భాగంగా ఉంచిన నిఘా మేరకు ఈ పర్యవేక్షణ నిర్వహించారు. ఎస్‌ఐ అరుణ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దారుకు సన్మానం



కేవీబీపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజుల నాయుడు, తిరుపతి పార్లమెంటరీ రైతు అధ్యక్షులు గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో గురువారం తహసీల్దారు మునిరత్నంరెడ్డిని ఘనంగా ఆయన కార్యాలయంలో సన్మానించారు. రెవెన్యూ సదస్సులను దిగ్విజయంగా పూర్తి చేసి కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకోవడంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలాజీ, జనసేన అధ్యక్షుడు థామస్, మునికృష్ణయ్య, శివరావు, చెంగయ్య, చంద్రారెడ్డి, నాదముని, దొరబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా పత్తాలేని ఎంపీపీ

● కుంటుపడుతున్న బీఎన్‌కండ్రిగ మండల అభివృద్ధి



మూతపడిన ఎంపీపీ గది

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రథమ పౌరురాలు ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి ఆరు నెలలుగా కార్యాలయానికి రాకపోవడంతో పరిపాలన గాడి తప్పింది. ఎంపీపీ గిరిజన మహిళ కావడంతో షాడో ఎంపీపీగా వ్యవహరిస్తున్న వైసీపీ ప్రముఖ నేత మెహం చాటేశారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వైస్‌ఎంపీపీ, ఎస్సీ వర్గానికి చెందిన మహిళ వైస్ ఎంపీపీలు సైతం పాలనను గాలికి వదిలేయడంతో వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయి. టీడీపీకి ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు ఉన్నా అధికార పార్టీ అయినా స్పందించడం లేదు. ఫలితంగా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితిలో ఉన్నారు. ముఖ్యంగా దళితవాడలు, గిరిజన కాలనీల్లో అనేక సమస్యలు తిష్టవేసి ఉన్నాయి. గత ఏడాది నవంబరు, డిసెంబరు మాసాలలో తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టాలను పరిశీలించి నష్ట పరిహారం అందేలా చూడవలసిన ఎంపీపీ పత్తా లేకపోవడంతో రైతులకు మొండి చెయ్యి మిగిలింది. పల్లెపండుగ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.2 కోట్లతో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులు గ్రామాలలో నత్త నడకన సాగుతున్నాయి. 35 గోకులం షెడ్ల నిర్మాణ పనులు అంతంతమాత్రమే సాగుతున్నాయి. పక్కా గృహాల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు సకాలంలో అందకపోవడంతో అనేక ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. భూ సమ్యల పరిష్కారానికి నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు పరిష్కారానికి నోచుకోలేదు. ఉపాధి హామీలో కూలీలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయత్ రాజ్, ఇంజనీరింగ్ సిబ్బంది అభివృద్ధి పనులను గాలికి వదిలేయడంతో అభివృద్ధి అటకెక్కింది. మండలంలోని 28 పంచాయతీలలోని రోడ్లు గుంతలమయమై అధ్వానంగా తయారై ఉన్నాయి. ఇప్పటికైనా ఎంపీపీ విధులకు హాజరై అధికారులను సమన్వయం చేసుకుని మండలాన్ని అభివృదిధ పథంలో నడిపంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇదేంటి గురువా?

● ఆన్‌లైన్‌లో తన పేరిట అనాధీన భూములు
● న్యాయం చేయాలంటున్న దళితులు



పొలాల వద్ద బాధిత రైతులు

వరదయ్యపాళెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అతనో గురువు. పదిమందికి విద్యాబుద్ధులు నేర్పి మంచి మార్గంలో పెట్టాల్సిన వాడు. అయితే అతనే వక్రమార్గంలో దళితుల అనాధీన భూములను తన పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నాడు. వరదయ్య పాళెం మండలం మరదవాడ పంచాయతీ రామలింగాపురం గ్రామంలో 3.67 ఎకరాల అనాధీన భూములున్నాయి. ఈ భూములను ఎస్సీ, ఎస్టీలైన మాజీ ఎంపీటీసీ వెంకటకృష్ణయ్య, దాసర్ల బాబు, పోలయ్య, రమేష్, నాగభూషణం, మానిక్యాల, నాగార్జున 40 సవత్సరాలుగా సాగుచేసుకుం టున్నారు. అయితే అబూరు నాగరాజు అనుభవంలోని 50 సెంట్లను ఓ టీచర్ ఆన్‌లైన్‌లో తనపేరుతో నమోదు చేసుకున్నాడు. ప్రస్తుతం మొత్తం 3.67 ఎకరాల భూమి తనదేనని అంటున్నాడు. పైగా ఆ భూమి ఆనుకుని వెళ్లే తెలుగుగంగ ఉప కాలువను పూడ్చివేశాడు. ఫలితంగా ఆ కాలువ నీటితో సాగయ్యే 150 ఎకరాల పంట ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఆ రైతులందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తమ భూమిని తమపేరుతో ఆన్‌లైన్ చేయించి ఇచ్చి అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంతాన సంపద వెంకటేశ్వరస్వామికి పూలంగిసేవ

శ్రీకాళహస్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాల సంతాన సంపద వెంకటేశ్వర స్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పాల్గొన్నారు.

